# లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జిలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094



ప్రచురణ ,తెలంగాణ. సంపుటి : 14 సంచిక : 244, పేజిలు : 12, వెల రూ. 2, /- శనివారం -04 - జూలై - 2026





## మంగళగిరి క్షేత్రానికి కొత్త శోభ.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

- మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి శంకుస్థాపన
- రూ.6.3 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో జీర్ణోద్ధరణ పనులు
- నూతన యాగశాల, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణకు శ్రీకారం
- భక్తుల సౌకర్యార్థం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని మంత్రి సూచన




## ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

- జపాన్ ప్రధానిని చెల్లెలుగా సంబోధించిన ప్రధాని మోదీ
- షింజో అబేను అన్నయ్యగా భావించేదాన్నని వెల్లడించిన తకాయిచి
- తొలి భారత పర్యటనకు వచ్చిన జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి

# రూ.7345 కోట్లతో మూసీ తొలి దశ

## గత్యంతరం లేక రాష్ట్రంలో కొత్త ఉపాధి చట్టం అమలుకు పచ్చజెండా

- ఈ చట్టం సమాఖ్య విధానానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని నిరసన
- బడులు, జూనియర్ కాలేజీల బోధనా సిబ్బందికీ అల్పాహారం, పాలు, లంచ్
- రాష్ట్రంలో లక్షన్నర మంది గురువులకు భోజన సదుపాయం
- నాలుగు టిమ్స్ ఆస్పత్రులకు 6,278 పోస్టులు మంజూరు
- కర్నూలపహాడ్, బొల్లికుంటలో భారీ గోదాముల నిర్మాణం



- నవోదయ పాఠశాలలకు స్థలాలు

హైదరాబాద్: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్--1 పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కి.మీ. పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.7,345.12 కోట్ల విలువైన పనుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మిగతా 2 లో

## పాక్ విఫల దేశంగా మారే అంచున ఉంది..
### సింగపూర్ మాజీ రాయబారి




- దౌత్యం వహించినంత మాత్రాన ప్రజలకు ఆహారం అందదంటూ చురకలు
- ఆర్థిక సంక్షోభం కొనసాగుతోందన్న సింగపూర్ దౌత్యవేత్త కౌశికన్
- రుణాలపైనే ఆ దేశం

## ఎస్ఐఆర్ నిలిపేయండి.. సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

- సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ
- ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం
- ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు
- కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య

ఢిల్లీ: దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే మిగతా 2 లో




## మోదీకి చంద్రబాబు వంటి నేతలు తోడైతే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది

### కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం

- ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌పై సజ్జన్ జిందాల్ ప్రశంసలు
- రాష్ట్రంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని జిందాల్ ప్రకటన
- ఈ పెట్టుబడులతో 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని హామీ
- చంద్రబాబు లాంటి నేతలుంటే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్న జిందాల్




అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా మిగతా 2 లో

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?..


## కేసీఆర్‌కు భట్టి సవాల్!.. హరీశ్‌పై భట్టి తీవ్ర విమర్శలు

- అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం
- సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ



హైదరాబాద్: తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. మిగతా 2 లో

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ
### దేశం నలుమూలల నుంచి తిరుమలకు భారీగా తరలివస్తున్న భక్తులు




- టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 12 గంటల సమయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 66,304 మంది భక్తులు

## 'రామాలయ దోపిడీని హిందువులు క్షమించరు'.. బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్
### అయోధ్య రామాలయం చుట్టూ మరోసారి రాజకీయాలు




- రామాలయ విరాళాలపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు.
- జూలై 5న 'రామ్ రక్ష' పేరుతో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు
- దాదర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద తొలి నిరసన




## అప్పుల లెక్కల్లో పొంతన లేదు.. మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి


- రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు
- సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు
- మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పు రూ.3.45 లక్షల కోట్లు అని గుర్తు చేసిన మాజీ మంత్రి
- ప్రభుత్వ పెద్దల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపణ

హైదరాబాద్: రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని


# రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం

## స్టీల్, సోలార్ ప్రాజెక్టుల ద్వారా 2700 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశం

- ★ రాయలసీమ ఉక్కు కల సాకారం.. జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ★ కడప జిల్లా సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం
- ★ విజయనగరం జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- ★ సౌర, పవన విద్యుత్‌కు మరో రూ.20,350 కోట్ల పెట్టుబడి పెట్టనున్న జేఎస్‌డబ్ల్యూ



అమరావతి: రాయలసీమ ప్రజల దశాబ్దాల ఉక్కు కలను సాకారం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ మిగతా 2 లో




## అమరావతి ఓ భారీ అవినీతి యజ్ఞం... త్వరలోనే కోర్టుకు వెళతా
### విజయసాయి రెడ్డి సంచలన ట్వీట్

- రాజధానిపై టీడీపీ, వైసీపీల వాదనలు అర్థరహితమని విజయసాయి రెడ్డి విమర్శ
- అమరావతి పేరుతో రూ.15 వేల కోట్ల అవినీతికి తెరలేపారని తీవ్ర ఆరోపణ
- భూమిలిచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయించకపోవడంపై ప్రభుత్వాలను నిలదీత
- అమరావతి అవినీతిపై పూర్తి ఆధారాలతో త్వరలో కోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి

## 'రామాలయ దోపిడీని హిందువులు క్షమించరు'..
# బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్

ఢిల్లీ: అయోధ్య రామాలయానికి భక్తులు ఇచ్చిన విరాళాలను దోచుకున్నారంటూ బీజేపీపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై పూర్తి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. జులై 5న సాయంత్రం ముంబైలోని దాదర్ కబూతర్‌ఖానా హనుమాన్ ఆలయం వద్ద 'రామ్ రక్ష' నిరసన నిర్వహిస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్ధవ్ పిలుపునిచ్చారు. రామ్ రక్షా స్తోత్రం, హనుమాన్ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని చెప్పారు. తాను స్వయంగా పార్టీ నేతలు, శివసైనికులతో కలిసి నిరసనకు నాయకత్వం వహిస్తానని వెల్లడించారు. రామ జన్మభూమి ఉద్యమం వల్లే బీజేపీ ఎదిగిందని ఉద్ధవ్ అన్నారు. ఇప్పుడు అదే రామాలయ విరాళాలపై అవినీతి ఆరోపణలు రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఆలయ నిధులను రాజకీయ అవసరాలకు, ఇతర పార్టీల్లో చీలికలు తీసుకురావడానికి వినియోగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. దాదర్‌లోని నిరసనతో ఉద్యమం ముగియదని ఉద్ధవ్ స్పష్టం చేశారు. అనంతరం మహారాష్ట్రలోని అన్ని జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లో రామాలయాలు, హనుమాన్ ఆలయాల వద్ద ఇదే తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రామాలయాన్ని దోచుకున్న వారిని హిందువులు క్షమించరని హెచ్చరించారు.

## అమరావతి ఓ భారీ అవినీతి యజ్ఞం... త్వరలోనే కోర్టుకు వెళతా

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి తీవ్రమైన ఆరోపణలతో ముందుకొచ్చారు. టీడీపీ 'అమరావతి' అంటుంటే, వైసీపీ 'మావిగన్' అనడం వంటి అర్థరహిత వాదనలను పక్కనపెట్టి, రాజధాని పేరుతో జరుగుతున్న భారీ అవినీతిపై దృష్టి సారించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అమరావతి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,000 కోట్ల అవినీతికి పథకం రచించారని, ఈ అవినీతి యజ్ఞంపై పూర్తి ఆధారాలతో త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తానని ఆయన సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను పంచుకుంటున్నానంటూ విజయసాయి రెడ్డి పలు కీలక ప్రశ్నలను సంధించారు. "రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా రాజధాని ఎక్కడో తేల్చకుండా చర్చించడం అందరూ సిగ్గుపడాల్సిన విషయం కాదా? 2029 ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయించాలా? ఈ రాజకీయ చదరంగానికి అన్ని పార్టీలు బాధ్యత వహించవద్దా?" అని ఆయన నిలదీశారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను ఎందుకు పక్కనపెట్టారని ఆయన ప్రశ్నించారు. అమరావతి నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని ఆయన వివరంగా ఆరోపించారు. "ప్రస్తుత ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం రూ.50,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నిర్మాణంలోనూ అంచనాలను భారీగా పెంచి చూపారు. ఇది 'దేవతల నగరం' అనే బ్రాండింగ్‌తో సాగుతున్న అతిపెద్ద అవినీతి పథకం. అధికారంలో ఉన్నవారు 25 నుంచి 30 శాతం వరకు కమీషన్లుగా దండుకుంటున్నారు. అంటే ఇది సుమారు రూ.15,000 కోట్ల చందాల స్కామ్. అసలు అమరేశ్వర ఆలయం, బుద్ధుని విగ్రహం ఉన్న ప్రాంతానికి, ఇప్పుడు భవనాలు కడుతున్న ప్రాంతానికి 50 కిలోమీటర్ల దూరం ఉంది. ఆ అమరావతి పుణ్యక్షేత్రం అయితే, ఈ అమరావతి అవినీతి ప్రవహించే క్షేత్రం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. మొదటి దశ భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు కేటాయించకపోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజధాని కోసం లక్ష ఎకరాలతో ఏం చేస్తారని నిలదీశారు. విభజన చట్టంలోనే వీజీటీఎం (విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి) అభివృద్ధి ప్రస్తావన ఉన్నప్పుడు, ఆ ప్రాంతంతోనే రాజధాని భవనాలను విస్తరిస్తే నష్టమేమిటని ఆయన సూచించారు. వైసీపీ 'మావిగన్' అనడం వల్ల ప్రయోజనమేంటని, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల గతేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటే పార్టీలు కమీషన్లు దండుకోవడం కాదని హితవు పలికారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఈ అవినీతిపై ఎవిడెన్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో, ప్రజాపక్షాన త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## మంగళగిరి క్షేత్రానికి కొత్త శోభ..
## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. దివ్య సన్నిధిలో రూ.6.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు కీలక పనులకు ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా చారిత్రక కట్టడాల పునరుద్ధరణతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు, అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నూతన యాగశాల నిర్మాణం, వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. చారిత్రక ప్రాధాన్యమున్న శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పనులకు సంబంధించిన నమూనా చిత్రాలను పరిశీలించారు. ఆ తర్వాత మంత్రి లోకేశ్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా కలియతిరిగి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. చేపట్టే పనులన్నీ ఆలయ సంప్రదాయాలకు, ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిత్య ప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పుష్కరిణిని కూడా పరిశీలించి, దాని అభివృద్ధికి అవసరమైన సలహాలు ఇచ్చారు. దేవాదాయ శాఖ సమకూర్చిన రూ.6.3 కోట్ల నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా చారిత్రక శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ, నూతన యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం వంటి ముఖ్యమైన పనులు జరగనున్నాయి. మంగళగిరి క్షేత్ర పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అనంతరం మంత్రి లోకేశ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్థానికులు, కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పలువురు టీడీపీ ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..
## మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి

హైదరాబాద్: రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుపతి: కలియుగ వైకుంఠమైన తిరుమల గిరుల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు ముగిసినప్పటికీ... వీకెండ్స్ ప్రభావం, సాధారణ రోజుల్లో సైతం దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో శ్రీవారి క్షేత్రం జనసందోహంగా మారింది. ప్రస్తుతం టోకెన్లు లేని సామాన్య భక్తులకు స్వామివారి సర్వదర్శనం కలగడానికి దాదాపు 12 గంటల వరకు సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్ వెలుపల ఉన్న నారాయణగిరి షెడ్ల వరకు కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో మొత్తం 66,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,811 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిన్న ఒక్కరోజే స్వామివారి హుండీ ఆదాయం రూ. 4.51 కోట్లు వచ్చినట్లు టీటీడీ పేర్కొంది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న చిన్నపిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. టోకెన్లు లేకుండా నేరుగా తిరుమలకు వచ్చే భక్తులు ఈ వేచి ఉండే సమయాన్ని గమనించి, తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

## పాక్ విఫల దేశంగా మారే అంచున ఉంది..
# సింగపూర్ మాజీ రాయబారి

ఢిల్లీ: ఇరాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించడంలో మధ్యవర్తిత్వం వహించి పాకిస్థాన్ అమెరికా దగ్గర కొన్ని మార్కులు కొట్టేసింది. అయితే ఈ దౌత్య చర్యల వల్ల పాక్ ప్రజల సమస్యలు పరిష్కారం కావని సింగపూర్ మాజీ రాయబారి బిలహరి కౌశికన్ స్పష్టం చేశారు. ఓ ప్రపంచ సదస్సులో మాట్లాడిన ఆయన.. పాకిస్థాన్ ఇప్పటికీ విఫల దేశంగా మారే అంచునే ఉందని తేల్చి చెప్పారు. అమెరికా దృష్టిలో పాకిస్థాన్ తన దౌత్య ప్రతిష్ఠను కొంత మెరుగుపరుచుకుందని బిలహరి అభిప్రాయపడ్డారు. కానీ ఆ విజయంతో ప్రజలకు ఆహారం అందదని, దేశ ఆర్థిక సంక్షోభం అలాగే కొనసాగుతుందని పేర్కొన్నారు. భారీ అప్పులు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల రుణాలపైనే పాకిస్థాన్ ఆధారపడుతోందని గుర్తుచేశారు. ప్రపంచ బ్యాంకు, 'అంతర్జాతీయ ద్రవ్య నిధి' (ఐఎంఎఫ్) వంటి సంస్థల సాయంతోనే పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ నడుస్తోందని కౌశికన్ అన్నారు. మరోవైపు దేశంలో ఆహార సంక్షోభం కూడా తీవ్రంగా ఉందని, ఈ పరిస్థితుల్లో దౌత్య విజయాలు ప్రజల జీవితాలను మార్చలేవని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ఇంకా పూర్తిగా విఫల దేశంగా మారలేదని, అది ప్రపంచానికి ఊరటనిచ్చే విషయమని కౌశికన్ అన్నారు. అయినప్పటికీ దౌత్య విజయాలు దేశ వాస్తవ పరిస్థితిని మార్చవని, పాకిస్థాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు పూర్తిగా తొలగిపోయే అవకాశాలు కూడా కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు.

# రూ.7345 కోట్లతో మూసీ తొలి దశ

మొదటి పేజీ తరువాయి

రూ.7,345.12 కోట్ల విలువైన పనుల మంజూరుకు ఆమోదం తెలిపింది. హిమాయత్ సాగర్ నుంచి ఈసా... ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు ఈ పనులు చేపడతారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులు... నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల మంజూరుతోపాటు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బంది డిప్యూటేషన్‌కు ఆమోదం తెలిపారు. త్వరలో ఫేజ్--1 పనులకు టెండర్లు పిలవనున్నారు. కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆస్పత్రులతోపాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులు మంజూరు చేసింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ బేసిక్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులకు అనుమతించారు. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్‌ఓసీలు కూడా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన వీబీ--జీ రామ్ జీ (వికసిత్ భారత్-- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్--(గ్రామీణ్)చట్టం--2026ను జూలై 1 నుంచి రాష్ట్రంలో అమల్లోకి తెచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించే విషయంలో గత్యంతరం లేక నోటిఫికేషన్ జారీకి ఈమేరకు కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఈ చట్టంలో విధించిన నిబంధనలపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. పార్లమెంటులోనూ కేంద్రం తీరును నిలదీయాలని తీర్మానించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గం సమావేశమై వీబీ--జీ రామ్ జీని రాష్ట్రంలో అమలు చేసే అంశంపై విస్తృతంగా చర్చించింది. సమావేశం అనంతరం సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహచర మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. కొత్త చట్టంపై ఇతర రాష్ట్రాలూ న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అందించాలని నిర్ణయించారు. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతోపాటు జవాబుదారీతనం పెంచే ఆలోచనలో భాగంగా రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి 50 ఎకరాలను, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ ధర ప్రకారం కేటాయించేందుకు ఆమోదం. జవహర్ నవోదయ విద్యాలయాలకు రెండు చోట్ల ప్రభుత్వం స్థలం కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేబినెట్ కేటాయించింది. జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మరికొన్ని సంస్థలకు భూములు కేటాయించారు.

# రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్‌తో కలిసి ఆయన కాంక్రీట్ వేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో మొత్తం రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించనున్నారు. తొలిదశ పూర్తయ్యేసరికి ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంటుంది. ఈ స్టీల్ ప్లాంట్‌తో పాటు, దీనికి అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇదే కాకుండా, రాష్ట్రంలో 3,850 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు మరో రూ.20,350 కోట్లు పెట్టుబడిగా పెట్టేందుకు జేఎస్‌డబ్ల్యూ సంస్థ ముందుకొచ్చింది.

వర్చువల్‌గా విజయనగరం పార్కు ప్రారంభం

ఈ కార్యక్రమం నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు విజయనగరం జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేసిన పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.531 కోట్ల పెట్టుబడితో 1166 ఎకరాల్లో ఈ పార్కును అత్యాధునిక వసతులతో, ప్లగ్ అండ్ ప్లే విధానంలో అభివృద్ధి చేశారు.

ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో సీఎం ఆసక్తి..

అంతకుముందు, స్టీల్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు ఆసక్తిగా పరిశీలించారు. స్టీల్ ప్లాంట్ మినియేచర్ మోడల్, నియో ఎనర్జీ ప్లాంట్ వివరాలను సజ్జన్ జిందాల్ ఆయనకు వివరించారు. హైదరాబాద్‌లో జేఎస్‌డబ్ల్యూ తయారుచేస్తున్న డిఫెన్స్ డ్రోన్ షీల్డ్ ఏఐ టెక్నాలజీ గురించి సీఎం ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రక్షణ, పౌర అవసరాలకు డ్రోన్ల తయారీపై దృష్టి సారించాలని, కర్నూలులో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలోని వసతులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. విపత్తుల సమయంలో వినియోగించే ప్రత్యేక వాహనాలను కూడా ఆయన పరిశీలించారు.

## మోదీకి చంద్రబాబు వంటి నేతలు తోడైతే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది: సజ్జన్ జిందాల్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉంటారని, ఆయన వచ్చే 25 ఏళ్ల అభివృద్ధిని ముందుగానే ఆలోచించి అమలు చేస్తారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు విజన్ వల్లే సైబరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు. దేశాభివృద్ధి గురించి నిత్యం తపించే ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు లాంటి ముఖ్యమంత్రులు తోడైతే, దేశం మరింత వేగంగా లక్ష్యాలను అందుకుంటుందని జిందాల్ అభిప్రాయపడ్డారు. చంద్రబాబు వంటి నేతలతో కలిసి పనిచేయడం పారిశ్రామికవేత్తగా తనకు గౌరవమని ఆయన పేర్కొన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, సజ్జన్ జిందాల్‌తో కలిసి ఆయన కాంక్రీట్ వేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ.. తమ గ్రూప్ తరపున ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.50 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ఈ పెట్టుబడులతో సుమారు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు విజయనగరం జిల్లాలో ఒక ఇండస్ట్రియల్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నామని జిందాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఏడాదికి 1 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ స్టీల్ ప్లాంట్‌ను భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ స్టీల్ ప్లాంట్‌ను మొత్తం రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశ పూర్తయితే ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. స్టీల్ ప్లాంట్‌తో పాటు, దీనికి అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు.

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?..

బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# ఎస్ఐఆర్ నిలిపేయండి.. సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

మొదటి పేజీ తరువాయి

ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

## ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

ఢిల్లీ: భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' అని సంబోధించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో, దివంగత మాజీ ప్రధాని షింజో అబేను తాను సొంత అన్నయ్యలా భావించేదాన్నని తకాయిచి గుర్తుచేసుకున్నారు. అబేకు ప్రధాని మోదీ అత్యంత సన్నిహితులు కావడంతో, తనూ ఆయనను అదే దృష్టితో చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. దీనికి స్పందించిన మోదీ, ఆమెను 'చిన్న చెల్లెలు' అని సంబోధించారు. ఈ అనుబంధంతోనే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఇరు నేతలు ఆకాంక్షించారు. జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తకాయిచి భారత్‌లో జరిపిన తొలి అధికారిక పర్యటన ఇది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి కోసం తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్థిక, ఇంధన భద్రతపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడంతో పాటు, రానున్న పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ సదస్సు ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన అధ్యాయానికి నాంది అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. స్వేచ్ఛాయుతమైన, నియమ నిబంధనలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు.

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్
## 7 రోజుల పాటు దంచికొట్టనున్న వర్షాలు

అమరావతి: నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో రాబోయే వారం రోజుల పాటు వాతావరణం పూర్తిగా మారిపోనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జులై 3 నుండి జులై 9 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాలు ఉమ్మడిగా వాతావరణ బులెటిన్‌ను విడుదల చేశాయి. రాబోయే 7 రోజుల పాటు రెండు రాష్ట్రాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశాయి.

తెలంగాణ వాతావరణ సూచన (జులై 3 - 9):

తెలంగాణ వ్యాప్తంగా జులై 9 వరకు విడతల వారీగా వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా రాష్ట్రంలోని ఉత్తర జిల్లాలపై వీటి ప్రభావం ఎక్కువగా ఉండనుంది. జులై 3 - 4: ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. జులై 4 - 5: ఉత్తర జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. జులై 5 - 9: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు నిరంతరాయంగా కురుస్తూనే ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్ వాతావరణ సూచన

ఏపీలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో రాబోయే 7 రోజుల పాటు వాతావరణంలో తీవ్ర మార్పులు ఉంటాయి. కోస్తాంధ్రాలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షంతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. అయితే, రాబోయే ఐదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలలో ఎలాంటి పెద్ద మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

రైతులు, ప్రయాణికులకు హెచ్చరిక

తీవ్రమైన ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల కారణంగా చేతికి వచ్చే దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. బలహీనంగా ఉన్న తాత్కాలిక నిర్మాణాలు, హోర్డింగులు కూలిపోయే అవకాశం ఉన్నందున ప్రయాణికులు, బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైతులు పొలం పనుల సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

## కాంగ్రెస్, భారాసల నాటకాలకు జనం నవ్వుతున్నారు

హైదరాబాద్: కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. "ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయి.గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు" అని సంజయ్ అన్నారు.

## వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థించా: కిషన్‌రెడ్డి

తిరుమల: దేశవ్యాప్తంగా వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కేంద్రమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఈ ఏడాది జూన్‌లో 40 నుంచి 50 శాతం మాత్రమే వర్షాలు కురిశాయి. అధిక జనాభా ఉన్న మన దేశంలో మంచి వర్షాలు కురిస్తేనే అవసరాలు తీరుతాయి. ప్రతి నీటి చుక్కను వృథా చేయకుండా కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీ భాజపా నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

# దేశ ఆర్థికాభివృద్ధిలో ఏపీ ముందుండాలన్నదే లక్ష్యం

అమరావతి: దేశ ఆర్థికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందుండాలన్నదే తమ ఆశయమని, 220 బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే కృత నిశ్చయంతో ఉన్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శ్రీసిటీలో శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని ఛైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ ఎండీ డా.రవీంద్ర సన్నారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇలాంటి ఒక ప్రపంచస్థాయి విద్యాకేంద్రాన్ని నెలకొల్పినందుకు యాజమాన్యాన్ని అభినందించారు. ఒక గొప్ప ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేశారంటూ శ్రీనిరాజును ప్రశంసించారు. ఎన్ని డిగ్రీలు ఇచ్చాం, ఎంతమంది ఉత్తీర్ణులయ్యారనే లెక్కల కంటే సమాజంలో ఎలాంటి మార్పు తీసుకొస్తున్నామనేలా విధానం మారాలన్నారు. డిగ్రీ ఉంటే చాలదని, మారుతున్న సాంకేతికత, నైపుణ్యం మేరకు సమస్యలను అధిగమించేలా విద్యార్థులను తయారు చేయాలన్నదే తమ సంకల్పమన్నారు. అలాంటి ఆలోచనతోనే ఏర్పాటు చేసిన ఈ యూనివర్సిటీ ద్వారా మరో 75 వేల ఉద్యోగాలు తీసుకురావాలన్నదే లక్ష్యమన్నారు.

### చంద్రబాబు మమ్మల్ని పరుగెత్తిస్తున్నారు..

గొప్ప విజన్ గల సీఎం చంద్రబాబు ఓ కల కన్నారంటే దాన్ని సాధించి తీరుతారని, ఆ స్వప్నం సాకారానికి తమను కూడా అదే స్పీడ్‌తో పరుగెత్తిస్తున్నారని లోకేశ్ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో నూతన విద్యావిధానం నుంచి స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, వికసిత్ భారత్ వరకు విద్యావ్యవస్థలో చాలా మార్పులు వస్తున్నాయని వివరించారు. శ్రీసిటీలో తనకు నచ్చిన మూడు అంశాల్లో వర్క్- స్టడీ విధానం విద్యార్థులకు అవసరమన్నారు. ప్రతి పారిశ్రామిక విప్లవం ఎన్ని ఉద్యోగాలు తీసేసిందో, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలను సృష్టించిందని.. ఏఐ కూడా అలాంటిదేనని చెప్పారు. తాము రాజకీయాల్లో సైతం ఏఐను వాడుతున్నామన్నారు.

# జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మంత్రి సిఎల్పీ మీడియా సెంటర్



నేను నా మాటకు కట్టుబడి ఉన్నాను ఈ రోజు కి కూడా ..ఆపరేషన్ సక్సెస్ , పేషంట్ డెడ్ అన్నట్లు బీఆర్ఎస్ తీరు ఉంది.. తాము చేసిన అప్పులు మూడు లక్షల పదిహేడు వేల పదిహేను కోట్లు అని ఒక సారి, మూడు లక్షల 85,340 కోట్లు మాత్రమే అని మరో సారి కేటీఆర్ చెప్పాడు.. 4 లక్షల 26 వేల 99 కోట్ల అప్పు అని ఒక సారి,4 లక్షల 17 వేల 496 మాత్రమే అని మరోసారి హరీష్ రావు చెప్పాడు.. హరీష్ రావు, కేటీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నారా..నా మాటకు కట్టుబడి ఉన్నా.. రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నా.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు లేఖ రాస్తున్న.. రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలి.. వాట్సాప్ ,మెయిల్ , స్పీడ్ పోస్ట్ ద్వారా ఈ లేఖ ను సీల్డ్ కవర్ లో పంపుతా.. నేను చెప్పినదానికి కట్టుబడి ఉన్నా.. మంత్రి పదవి, ఎమ్మెల్యే పదవి రాజీనామా చేస్తా మీరు చెప్పింది అబద్దం అయితే వాళ్లు ఏం చేస్తారో చెప్పాలి.. రాత పూర్వకంగా చెప్పాలి.. ఏదో మాట్లాడి అసలు దానికి జవాబు చెప్పకుండా తప్పుదారి పట్టిస్తున్నారు.. అప్పులు మూడు రకాలుగా ఉంటాయి.. బీఆర్ఎస్ హయాంలో అప్పులు, బకాయిలు కలిపి 8,21,651 కోట్ల అప్పులు చేశారు.. కార్పొరేషన్ల తెచ్చిన అప్పులతో మాకు సంబంధం లేదు, మేం తేలేదని చెపుతున్నారు.. మీరు అప్పులు తేకపోతే ప్రభుత్వ ఖజానా నుంచి ఎందుకు చెల్లించారు.. కాళేశ్వరం, పాలమూరు కోసం అప్పులు తెస్తే వాటిని రైతులతో కట్టిస్తారా..? మిషన్ భగీరథ పేరుతో తెచ్చిన అప్పులు ఎవరు కడతారు..? మంచి నీళ్లు తాగుతున్న ప్రజలతో కట్టిస్తారా..? కేసీఆర్ అసెంబ్లీ కి రావడం లేదు.. కనీసం మీడియా ను పిలిచి కేసీఆర్ మాట్లాడాలి.. 5 గంటలకు నేను ప్రెస్ క్లబ్ కు వస్తా.. అక్కడైనా చర్చకు సిద్ధం.. రుజువు చేయపోతే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా.. పార్టీని కేసీఆర్ రద్దు చేస్తారా.. సమాధానం తీసుకుని రావాలి.. నేను రాజీనామాకు సిద్ధం.. మిస్టర్ హరీష్ రావు, కేటీఆర్.. ఆనాడు పాలమూరు పౌరుషం , చీము ,నెత్తురు ఉండబట్టే మంత్రి పదవికి రాజీనామా చేశా.. కుడి భుజం, ఎడమ భుజం అని చెప్పుకున్న మహబూబ్ నగర్ లో ఒక్క సీటు తేలేకపోయారు..నేను రాజీనామా చేశాకే జిల్లాలో 6 సీట్లు బీఆర్ఎస్ కు వచ్చాయి.. నా రాజీనామా ప్రభావం రాష్ట్రమంతా ఉంది..నేను మాటకు కట్టుబడి ఉండే వ్యక్తిని..సిగ్గుతప్పిన మాటలు మాట్లాడుకుంటు నాకు పౌరుషం లేదని అంటున్నారు.. హరీష్ రావు వస్తానని అన్నాడు కాబట్టే అమరవీరుల స్థూపం వద్దకు వస్తానని చెప్పాను..తెలంగాణ భవన్ కు రాలేదన్న వంక చూపించి విమర్శిస్తున్నారు.. నేను అబద్దాలు చెప్పను.. నా ఆత్మగౌరవాన్ని ప్రశ్నించలేరు.. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి నేను గతంలో రాజీనామా చేశాను.. ఉద్యోగానికి వెళ్లకుండా ఊరు వెళ్లి వ్యవసాయం చేసుకున్నాను.. మీ లాగా అడ్డగోలుగా సంపాదించలేదు.. అడ్డగోలు మాటలు మాట్లాడి ఆరోపణలు చేస్తే కబర్దార్.. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా, తన్నీరు పౌరుషమో చెప్పాలి.. నేను తోకముడిచేవాన్నీ కాదు.. నాకు పదవులు ముఖ్యం కాదు.. ఆత్మగౌరవం ముఖ్యం.. నా సవాల్ కు కట్టుబడి ఉన్నా.. మీ పౌరుషం, రోషం, పరమితి ఏమిటో దమ్ము ధైర్యం ఉంటే చెప్పాలి.. కూట్లో రాయి తీయలేనోడు,ఏట్లో రాయి తీస్తా అన్నట్లుగా కేటీఆర్, హరీష్ రావు తీరు ఉంది.. ఎన్నికల ముందు అవుటర్ రింగ్ రోటడ్డు ను అమ్మి రైతు బంధు కింద 5,800 కోట్లు మాత్రమే చెల్లించారు..'రి'

# మెకానిక్‌ల సేవలు సమాజానికి అమూల్యం

**ప్రపంచ మెకానిక్స్ డేను ఘనంగా నిర్వహించిన టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్**



లోకల్ గైడ్ఆమనగల్లు, జూలై 3 : ప్రపంచ మెకానిక్స్ డే సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అయ్యప్ప కొండ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ప్రముఖ సంఘసేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, శ్రీరామ ఆటో మొబైల్ సత్యం ముఖ్య అతిథులుగా హాజరై టూ వీలర్ మెకానిక్‌ల సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ, మెకానిక్ వృత్తి సమాజానికి ఎంతో అవసరమైన సేవా రంగమని అన్నారు. ప్రజల నిత్యజీవితంలో వాహనాల నిర్వహణ, రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగడంలో మెకానిక్‌ల పాత్ర కీలకమని కొనియాడారు. నైపుణ్యం, కృషితో పనిచేసే మెకానిక్‌లు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పర్వతాలు, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, కోశాధికారి శ్రీను, గౌరవ అధ్యక్షుడు కృష్ణతో పాటు నరసింహ, కొండల్, లక్ష్మణ్, మల్లేష్, జంగయ్య, వెంకటేష్, రవి, మహేష్, రాజు, విజేందర్, విక్రమ్ సింగ్, క్రాంతి, శివ, సురేష్ తదితర మెకానిక్‌లు పాల్గొని ప్రపంచ మెకానిక్స్ డేను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# అడివమ్మ కుటుంబసభ్యులకు 25 కేజీల బియ్యం 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన జే కె ట్రస్ట్.



లోకల్ గైడ్ జడ్చర్ల జులై 3జడ్చర్ల నియోజక వర్గం నవాపేట మండల కేంద్రంలో నీ మల్లేపాగు అడివమ్మా అనారోగ్యం తో మరణించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి 25 కేజీల బియ్యం,మరియు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించిన జెకే ట్రస్ట్ కుటుంబ సభ్యులు, వి. నరసింహ చారి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ మండల ఏ ఎం సి చైర్మన్.ఈ కార్యక్రమంలో జే కె ట్రస్ట్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో ప్రాంత రూపురేఖలు మారతాయి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



లోకల్ గైడ్ ఆమనగల్లు, జూలై 3 రంగారెడ్డి జిల్లాలోని ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని సందర్శించి అనంతరం వివాహ కార్యక్రమానికి పాల్గొనటానికి విచ్చేసిన రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి



పనులు వేగవంతం కావడం వల్ల కడ్తాల్ మరియు ఆమనగల్లు మండలాలు పాటు పరిసర ప్రాంతాల ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ సభ్యుడు భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, కడ్తాల్ ఉప సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట్ట నర్సింహ, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్య నాయక్, మైసిగండి సర్పంచ్ ప్రేమ జోహార్లాల్ నాయక్, మాజీ సర్పంచ్ శంకర్, మహేష్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లోనే తొలిసారిగా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఒకే రోగికి, ఒకేసారి ఐదు అవయవాల (మల్టీ-విసెరల్)



లోకల్ గైడ్ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి దేశ వైద్య చరిత్రలో అరుదైన ఘనత సాధించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ప్లాంట్ బృందానికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉస్మానియా డాక్టర్లు తెలంగాణతో పాటు, యావత్ దేశానికే గర్వకారణమైన ఘనతను సాధించారని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సల్లో ఒకటిగా భావించే మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతంగా నిర్వహించడం అసాధారణ విజయమన్నారు.డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని ట్రాన్స్‌ప్లాంట్ బృందం 36 గంటల పాటు శ్రమించి ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం అసాధారణ విజయమని కొనియాడారు. ఈ చారిత్రాత్మక విజయానికి కృషి చేసిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, అనస్థీషియా నిపుణులు, గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, క్రిటికల్ కేర్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది అందరికీ మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.అలాగే, అవయవదానం ద్వారా మరో ప్రాణానికి జీవం పోసిన అవయవదాత కుటుంబ సభ్యుల సేవాభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ, “అవయవదానం… మహాదానం” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ సమాజంలో విస్తృతంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా, పోటీగా వైద్య సేవలు అందించే విధంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేశామని, తాజాగా మరో 6238 పోస్టులను మంజూరు చేశామని మంత్రి గుర్తు చేశారు.పాత భవనాలు, అద్దె భవనల్లో కొనసాగుతున్న హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలకు కొత్త భవనలు నిర్మిస్తున్నామని తెలిపారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక ఎక్విప్‌మెంట్, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ప్రజలకు అన్నిరకాల మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొస్తున్నారని మంత్రి ప్రశంసించారు.

## ములుగు జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ గా

# సల్లూరి సతీష్ నియామకం

మంత్రి సీతక్క చేతుల మీదగా ఆర్డర్ కాపీ అందజేత



వాజేడు,లోకల్ గైడ్ ప్రతినిధి :- జూలై 03 మండల పరిధిలోని అయ్యవారిపేట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సల్లూరి సతీష్ ను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా ఎన్నిక మంత్రి సీతక్క చేతుల మీదగా ఆర్డర్ కాపీ అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సల్లూరి సతీష్ మాట్లాడుతూ వాజేడు మండలంలోని మారుమూల ప్రాంతంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో కీలక పాత్ర వహిస్తున్నందుకు గాను నాకు జిల్లా స్థాయిలో గుర్తింపు ఇచ్చి ములుగు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమించినందుకు మంత్రి దనసరి సీతక్కకి, మరియు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ కి, మలుగు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మట్టేవాడ తిరుపతి కి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కి పార్టీ నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సహాయం అందించిన అభిమన్యు రెడ్డి.



లోకల్ గైడ్ జడ్చర్ల జులై 3జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల పరిధిలోని సింగమ్మగూడ తాండ గ్రామపంచాయతీ లోని కేశ్యా నాయక్ ( రాళ్ళ తండ) కు చెందిన రాత్లావత్ గోపియా నాయక్ కుమార్తె నిఖిత వివాహానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని యువసేన సభ్యుల ద్వారా అందించిన బి ఆర్ ఎస్ పార్టీ యువనేత చించోడు అభిమన్యు రెడ్డి. ఈ కార్యక్రమంలో సింగమ్మ గూడ తాండ బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రంజిత్ నాయక్, బి ఆర్ ఎస్ నాయకులు వాల్య నాయక్,ఎస్. నరేష్ నాయక్,రఘు నాయక్, రప్సింగ్,కుమార్,వాచ్యా,శ్రీను,శంకర్,రాంచందర్,మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, యువసేన సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి లో ఘనంగా ప్లాస్టిక్ బ్యాగ్ నివారణ దినోత్సవం.



లోకల్ గైడ్. ఖమ్మం“ప్లాస్టిక్ బ్యాగ్ కి స్వస్తి పలుకుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే నినాదంతో,ప్లాస్టిక్ బ్యాగ్ వినియోగం వల్ల పర్యావరణానికి, జీవరాశులకు మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని , దానిపై అవగాహన కల్పించేందుకు మా త్రివేణి లో ప్లాస్టిక్ బ్యాగ్ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర సంచులను, జ్యూట్ బ్యాగులను, మరియు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగిస్థామని ప్రతిజ్ఞ చేశారు.పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తూ నేల, నీరు, గాలి కాలుష్యానికి కారణం అవుతున్నాయని తెలిపారు.పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ప్లాస్టిక్ నో చెప్పండి ప్రకృతికి అవును అని చెప్పండిఈరోజు వస్త్ర సంచి వాడుదాం - భావితరాలకు స్వచ్ఛమైన భూమిని అందిద్దాంలి “వంటి నినాదాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు…ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న ,ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొని

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ గీతారాణి.



లోకల్ గైడ్ జడ్చర్ల జులై 3జడ్చర్ల నియోజక వర్గం నావాబుపేట మండల కేంద్రము లోని కారుకొండ లక్ష్మమ్మ, కారుకొండ నరసింహులు గార్ల కుమారుడు నవీన్, అనురాధ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన నవాబుపేట సర్పంచ్ గీతారాణి మరియు జెకె ట్రస్ట్ కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల వ్యాపార సంఘం అధ్యక్షులు సుధాకర్ చారి, జే కె ట్రస్ట్ చైర్మన్ మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ మండల ఏ ఎం సి చైర్మన్ వి. నరసింహా చారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి..జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వనమహోత్సవంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలి**
**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత**
**వనమహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని పిలుపు**
**భావితరాల కోసం మొక్కలు నాటి, సంరక్షిస్తూ వాతావరణ మార్పులకు శాశ్వత పరిష్కారం**
**సత్తుపల్లి జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించి వనమహోత్సవ భారీ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్,ఎమ్మెల్**



ఖమ్మం, సత్తుపల్లి, జూలై - 03 లోకల్ గైడ్ :భావితరాల సంక్షేమం కోసం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి మొక్కలను పెద్ద ఎత్తున నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు.శుక్రవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో విద్యార్థులు, యువత, ప్రజలతో జేవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనమహోత్సవ సభలో నిర్వహించిన కార్యమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా




రాగమయి దయానంద్ తో కలిసి ప్రారంభించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో, ఉత్సాహభరితంగా నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఉత్సాహం కలిగించిందని, ప్రజల భాగస్వామ్యం కలిగిన కార్యక్రమాన్ని చూస్తున్నానని సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.వనమహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదని, అది ఒక పండుగగా, సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. దీపావళి, దసరా, సంక్రాంతి వంటి పండుగలను ఎలా ఆనందంగా జరుపుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా పండుగలా నిర్వహించా లని పిలుపునిచ్చారు. చరిత్రలో చక్రవర్తి అశోకుడు ఒక వృద్ధుడు మొక్కలు నాటుతున్న దృశ్యాన్ని చూసి, తన కోసం కాకుండా భావితరాల కోసం మొక్కలు నాటుతున్నానన్న ఆ వృద్ధుడి మాటలతో స్ఫూర్తి పొంది తన రాజ్యం అంతటా రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది కోట్లాది మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, యూరప్‌లోని జర్మనీ వంటి దేశాల్లో కూడా తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా రహదారులు దెబ్బతినడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు.ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం, విచ్చలవిడిగా వనరులను వినియోగించడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.చెట్లు, పక్షులు, నేల, నీటి వనరులు, జీవ వైవిధ్యాన్ని కాపాడటం ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడమూ అంతే ముఖ్యమని అన్నారు. వనమహోత్సవం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని, ప్రతి పౌరుడు తన ఇంటి వద్ద, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ రోజు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అమూల్యమైన ఆస్తి అని, ప్రకృతిని కాపాడితేనే ప్రకృతిమనలను కాపాడుతుందని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు.సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ భాద్యులు మట్టా దయనంద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.-

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బసంత్‌నగర్‌లో ఆకస్మిక తనిఖీ

### డీఎంఅండ్‌హెచ్‌వో డా. వై. పవిత్ర



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జులై 03 (లోకల్ గైడ్ తెలంగాణ)పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డి ఎం ఒహేచ్ ఓ ) డా. వై. పవిత్ర నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బసంత్‌నగర్‌ను ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. ఎం. శారళి సిబ్బందితో సమావేశమై పలు కీలక



సూచనలు చేశారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు, అలర్జీ, అంటు వ్యాధులు మలేరియా ఫైలేరియా డెంగ్యూ చిక్కును గునియా, రక్త విరోచనాలు నీళ్ల విరోచనాలు, హెపటైటిస్ టైఫాడ్ సంబంధిత కేసులపై ప్రత్యేక అప్రమత్తతతో పనిచేయాలని ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే ద్వారా జ్వర గ్రస్తులను గుర్తించి రక్త పరీక్షలు సేకరించి వెంటనే ల్యాబ్లలో పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించాలని తెలిపినారు. వర్షాకాలంలో సంభవించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి వారు వ్యాధులకు గురి కాకుండా తెలపాలని కోరినారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహాయంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు అయినా వెంటనే తగిన చికిత్సలు తీసుకోవాలని ప్రజలను కోరినారు.ఆసుపత్రిలో నిర్వహిస్తున్న అన్ని రికార్డులు, రిజిస్టర్లు, నివేదికలను ఎప్పటికప్పుడు పూర్తి వివరాలతో నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా మాతా–శిశు ఆరోగ్య (ఎం సి హేచ్) సేవలను మరింత మెరుగుపరిచి గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని తెలిపినారు. నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆరోగ్య సేవల నాణ్యతను పెంపొందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఎం. శారళి, ఆరోగ్య సిబ్బంది ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కోటకొండ చేనేత సొసైటీ అధ్యక్షుడు గా శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



నారాయణపేట జూలై 3:నారాయణపేట మండలం కోటకొండ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవముగా జరిగాయి. చేనేత కామ్యూనిటీ భవనములోఎన్నికల అధికారి శరత్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా అధ్యక్షులుగా కెంచే శ్రీనివాసులు ఉపాధ్యక్షులుగా కెంచే నారాయణ, కార్యదర్శి గా యంగలి రఘురాములు, కోశాధికారిగా సాక బాలప్ప, సభ్యులుగా పగుడాకుల రాములు, ఎర్పుల వెంకట్రా ములు, బోగం రాములు, కొంగరి మణెమ్మ,సంగ రమేశ్వరమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భముగా నూతనం గా ఎన్నిక అయిన అధ్యక్షులు కెంచే శ్రీనివాసులు మాట్లాడుతూ కోటకొండ చేనేత పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉందని దానిని కాపాడుకోవడం మన బాధ్యత అని చేనేత కార్మికులు సమస్యలు పరుస్కారం కొరకు నిరంతరం వారి మధ్యన ఉంటూ పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పగుడాకు ల శ్రీనివాసులు,కొంగరి రాములు,సాక ప్రవీణ్ ,సంగ రాములు ,సాక బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల ఛేదనలో జాగిలాల పాత్ర అత్యంత కీలకం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట జూలై 3: నేరాల ఛేదనలో పోలీస్ జాగిలాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ వినీత్ అన్నారు.జిల్లా కేంద్రంలోని పత్తి బజార్‌లో ఉన్న జిల్లా పోలీస్ డాగ్ కెన్నెల్‌ను జిల్లా ఎస్పీ వినీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు శాఖలో నేరాల ఛేదన, పేలుడు పదార్థాల గుర్తింపు, మాదక ద్రవ్యాల నియంత్రణ, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ వంటి కీలక విధుల్లో సేవలందిస్తున్న పోలీస్ జాగిలాల నిర్వహణ, సంరక్షణ, శిక్షణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కెన్నెల్‌లో ఉన్న నాలుగు ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలు రూప (ఎక్స్‌ప్లోజివ్), రుద్ర (ట్రాకర్), విక్కీ (నార్కోటిక్స్), లక్కీ (ఎక్స్‌ప్లోజివ్) జాగిలాల ఆరోగ్య పరిస్థితి, ఆహార నిర్వహణ, వసతి, పరిశుభ్రత, శిక్షణ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు.జాగిలాల కోసం ఏర్పాటు చేసిన ప్రతి గది వద్ద ఆయా జాగిలాల పేరు, ప్రత్యేక నైపుణ్యం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలు, అవార్డులు, సేవల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల జాగిలాల సేవలపై అవగాహన పెరగడంతో పాటు వాటి పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ జాగిలాలు పోలీసు శాఖకు అమూల్యమైన ఆస్తి అని అన్నారు. హత్యలు, దొంగతనాలు, పేలుడు పదార్థాల గుర్తింపు, నార్కోటిక్స్ కేసులు, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ వంటి క్లిష్టమైన కేసుల్లో జాగిలాలు కీలక పాత్ర పోషిస్తూ నేరాల ఛేదనను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు.జాగిలాలకు ప్రతిరోజూ నిర్దేశించిన డైట్ చార్ట్ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, శుభ్రమైన తాగునీరు, విశ్రాంతి, సమయానికి వైద్య పరీక్షలు, అవసరమైన టీకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, ప్రత్యేక శిక్షణ నిర్వహించడం ద్వారా వాటి సామర్థ్యం మరింత పెరుగుతుందని చెప్పారు.డాగ్ కెన్నెల్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఎల్లప్పుడూకొనసాగించాలని, జాగిలాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్‌లను మరింత సమర్థవంతంగా వినియోగించాలని, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.పోలీస్ జాగిలాల పనితీరు ఎంత మెరుగ్గా ఉంటే నేరాల ఛేదన అంత వేగవంతంగా జరుగుతుందని, ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అధికారులు జాగిలాల సంరక్షణ, శిక్షణ, ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ తనిఖీలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, శివ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ డాగ్ కెన్నెల్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కాపాడాలని అన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని పెరిగే వరకు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.

## : డిల్లీ మీడియా సదస్సుకు పేట డీపీఆర్ఓ రషీద్



నారాయణపేట జూలై 3:నారాయణపేట జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం ఏ రషీద్ ఢిల్లీలో శు క్రవారం నిర్వహించిన మీడియా కమ్యూనికేషన్ అధికారుల జాతీయ సదస్సుకు హాజర య్యారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఐ ఐ ఐ డి ఈ ఎంలో జరిగిన ఈ సదస్సులో మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారంపై సాంకేతిక సెషన్లలో ఆయన పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సుకు తెలంగాణ నుంచి ఎంపికైన అధికారులలో రషీద్ ఒకరు.

## సంక్షేమపథకాలు, శుభకార్యాల్లో పాల్గొన్న కాంగ్రెస్ ప్రతినిధులు



నారాయణపేట జూలై 4: నారాయణ పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల శుక్రవారం మేరకు కాంగ్రెస్ పార్టీప్రతినిధులు ,నాయకులుసంక్షేమప థకాలు,శుభకార్యాల్లో పాల్గొన్నారు. నారాయణ పేట మండలం లో పలు శు భాకార్యలో పాల్గొన్న మన జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి,ఎమ్మెల్యే ముఖ్య సహాయకులు చిట్టెం మాధవరెడ్డి, పెరపల్ల మాజీ ఎంపీటీసీ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శరణప్ప, లక్ష్మి పూర్ సర్పంచ్ మమత ,ఎక్లస్పూర్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో గ్రామ సర్పంచ్ శేఖర్ గౌడ్, తారక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఉషాప్ప,అనంతరం జాజాపూర్ రైతు వేదిక లో ప్రభుత్వం నుండి వచ్చిన పత్తి విత్తనాలు పంపిణి చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ లు వార్డ్ మెంబెర్స్ గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఆదిత్యపారశ్రీ స్వామి లక్ష విరాళం



నారాయణపేట జూలై 3:నారాయణపేట పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణం, స్మృతివన అభివృద్ధి పనులకు బిజ్వార్ అంబాత్ర్యా క్షేత్ర వ్యవస్థా పకులు పరమపూజ్య శ్రీ ఆదిత్యపారశ్రీ స్వామి శుక్రవారం లక్ష విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భం గా జరిగిన సమావేశంలో పరమపూజ్య ఆదిపరాశ్రీ స్వామిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీపాద మాట్లాడుతూ ప్రాజెక్టు పురోగతిని, విగ్రహ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశ్యాలను గురువులకు వివరించారు. ఈ సందర్భంగా పరమ పూజ్య స్వామి మాట్లాడు తూ, భారతీయ సంస్కృతిని, చరిత్ర స్ఫూర్తిని భావితరాలకుఅందించేందుకు నారాయణపేటలో శివాజీ స్మృతివనం నిర్మించడం అభినందనీయం అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ మహత్తర యజ్ఞానికి నా వంతు సహకారం ఎల్లప్పు డూ ఉంటుందన్నారు. ప్రాజెక్టుకు తొలి విడతగాలక్ష ఆర్థిక సహాయాన్ని అందించి నట్లు ప్రకటించారు.ఈ కార్య క్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు కురుమన్న, అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద, ఉపా ధ్యక్షులు వెంకటేష్ గౌడ్, పల్లా రఘు, మహాదేవ్, నవీన్, గోపీకృష్ణ, జిత్తూ పటేల్, అప్పి, బాలరాజు, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్, మహిళా కమిటీ అధ్యక్షురాలు సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పిఆర్సి వెంటనే ప్రకటించాలి పి ఆర్ టి యు డిమాండ్



నారాయణపేట జూలై 3:ఉపాద్యాయులు పి ఆర్ సి నీ వెంటనే ప్రకటించాలని పి ఆర్ టి యు నాయకులు డిమాండ్ ప్రభుత్వానికి చేశారు.పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపేట జిల్లాలోనీ కొత్తపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూనేడులో పి అర్ టి యు టీఎస్ 2026 -2027 విద్యా సంవత్సరము పి ఆర్ టి యు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్రప్రధానోపాధ్యాయురాలు నీలిమ మాట్లాడుతూ పి ఆర్ టియు సంఘం మాత్రమే ఉపాధ్యాయుల సంఘం అని దీని ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ సంఘ సభ్యులకు ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఇప్పటివరకు సాధించబడ్డ సమస్యలన్నీ కేవలం పి అర్ టి యు సంఘ ము ద్వారానే సాధించబ డ్డాయని, భవిష్యత్తులోనూ అపరిష్కృత సమస్యలు సంఘము ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. అందువల్ల ఉపాధ్యాయులు బేషజాలకు పోకుండా స్వచ్ఛందంగా సంఘంలో సభ్యత్వం చేసి సంఘమును ఇంకా బలోపేతం చేయాలని కోరారు ఇప్పటివరకు ప్రభుత్వమునకు ఉపాధ్యాయ లోకం అన్ని విషయాలలో సహకరిస్తుందని అది గుర్తించి ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు ఇంకా ఆలస్యం చేయకుండా వెంటనే పిఆర్సి పెండింగ్,డి ఎ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులు సహనం కోల్పోయి రోడ్డెక్కి ప్రమాదం ఉందని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారు వారి మేనిఫెస్టోలో సూచించిన విధంగా వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని కోరారు.హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని త్వరలోనే అమలు అవుతాయనిమార్గదర్శకాలు మనము కోరుకున్నట్లే ఉంటాయనిఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు. ఉపాధ్యాయులు కూడా ఆలోచించి సభ్యత్వం చేసి ఉపాధ్యాయుల ఉనికిని కాపాడుకోవాలని సూచించారు. కొంతమంది మాటలతో మభ్యపెడుతూ సంఘాలకు కొత్త బాష్యం చెప్పుతూ ఉపాధ్యాయుల ఉనికిని కాలరాస్తున్నారని అలాంటి వారి మాయలో పడి ఇప్పటికే చాలా నష్టాన్ని మనం పొందామని అది గుర్తుఎరిగి సభ్యత్వం చేయాలనీ సూచించారు. పి అర్ టి యు సంఘం పెన్షన్ తెస్తే పెన్షన్ తీసివేసిన పార్టీల వెంబడి ఉండే సంఘాలు ఇవాళ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తా మని చెప్పడం దివాలు కోరుతనానికి నిదర్శనమని వారు దుయ్యబట్టారు. ఆలస్యమైనప్పటికీ త్వరలోనే సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందని లేనిపక్షంలో ఉద్యమ బాట పడుతుందని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయ బృందం స్వచ్ఛందంగా పి ఆర్టీయూలో సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్ ఆంజనేయులు కొత్తపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి భీమేష్,నారాయణ పేట మండలం అధ్యక్షులు ఎం.రఘువీర్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి సీనియర్ సభ్యులు చెన్నకేశవరెడ్డి,సనత్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి,తిమ్మారెడ్డి, నర్సింలు, శివాజీ, హైమద్ అలీ,రాణి బాయి,శ్రీలత,కవిత,వెంకటేష్,కిషోర్,అనిత,సి ఆర్పి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల నిరసన



నారాయణపేట జూలై 3:మిషన్ భగీరథ కార్మికులకు కాంట్రాక్ట్ వర్కర్స్ గా గుర్తించాలని ప్రతి నెల మొదటి తారీకే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నారాయణపేట జిల్లా,కృష్ణా మండలం గుడిబల్లూరు, పంప్ హౌస్ దగ్గర కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కృష్ణా మండలం గుడెబల్లూరు పంపోల్ దగ్గర మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పెంచిన వేతనాలు ఒకటో తారీకు రాకపోవడం అట్లాగే మిషన్ భగీరథ కార్మికులకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులుగా గుర్తించకపోవడం చాలా సిగ్గుచేటు అని పేర్కొన్నారు. కార్మికులు నిత్యం ప్రతిరోజు గ్రామాలలో నీటి సరఫరా చేస్తున్నారు ముఖ్యమంత్రి జీవో 6 ప్రకారం పెంచిన జీతాలను మాకు వర్తింపజేసి ప్రతినెల 1 తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. అట్లాగే మిషన్ భగీరథ అధికారులు కూడా కార్మికులను నిమ్మక్కు నేరెత్తినట్ల వ్యవహరిస్తు న్నారనీవిమర్శించారు. ,కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం పిఎఫ్ ఈఎస్ఐ కట్టకపోవడం సకాలంలో వేతనాలు రాక చాలా ఇబ్బంది గురవుతున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన కార్మికులకు ఆశ లేపిన కానీ మిషన్ భగీరథ కార్మికులకు నిరాశ గానే మిగిలిపోయిందన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మక్తల్ సత్యసాయి స్కీం 26 సంవత్సరాల కెళ్ళి కొనసాగుతున్నదనీ ఈ స్కీం లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నా రనీ ఆవేదన వ్యక్తం చేశారు.కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విడుదల చేసిన వేతనాలు సత్యసాయి కార్మికులకు వర్తింపజేయాలని రాష్ట్రంలో మిషన్ భగీరథ కార్మికులకు అందరికీ 6 నెంబర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ జీ,భుట్టో,టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు .శ్రీనివాస్ మిషన్ భగీరథ కార్మిక సంఘం కార్యదర్శి , ఉపాధ్యక్షులు తిప్రేస్పల్లి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రవి ,రవిప్రసాద్, సాబేర్ మియా, నారాయణ ,మహేష్ ,కుమార్ శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ -- "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ఉల్లాస్ యాప్ పైన ఓకరోజు ఓరియంటేషన్



నిజామాబాదు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జులై 03: నిజామాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ -- అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా మెప్మా క్షేత్ర స్థాయి సిబ్బందికి ఉల్లాస్ యాప్‌పై ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం ఐ.డి.ఓ.సి. సమావేశమందిరంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరై , కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ , చదువు నేర్చుకోలేని , చదువు మధ్యలో మానేసిన వయోజనులను గుర్తించి, వారికి చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి వారిని అక్షరాస్యులుగా మార్చాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాను 100% అక్షరాస్యత గల జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. ఇప్పటికే గుర్తించిన 6776 నిరక్షరాస్యులు మరియు 497 వాలంటీర్ టీచర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేసి, లిటరసీ లెర్నింగ్ సెంటర్ల ద్వారా వారికి బోధన అందించి రానున్న ఎఫ్ ఎల్ ఎన్ ఏ టి / ఎన్ ఐ ఓ ఎస్ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడం కోసం అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏ. పురుషోత్తం ,మెప్మా డీ ఎం సి మాధురి , అకౌంట్స్ ఆఫీసర్ విజయ, ఏపీఓ టి. అరుంధతి, జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లు ఎం. సుమన్, ఎ. సత్యనారాయణ మూర్తి పాల్గొని ఉల్లాస్ యాప్ వినియోగం, అభ్యాసకుల నమోదు, వాలంటీర్ మ్యాపింగ్ మరియు కార్యక్రమ అమలుపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో మెప్మా క్షేత్ర స్థాయి సిబ్బంది టి ఎం సి లు, సి ఓ లు, ఆర్ పి లు , డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఉల్లాస్ యాప్‌లో అభ్యాసకుల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా ప్రదర్శించి, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన విధానాలను వివరించారు. జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## : ఈనెల 12నా ఆరవ తరగతి ప్రవేశపరీక్ష



లోకల్ గైడ్, వికారాబాద్ :వికారాబాద్ జిల్లాలో ఎంపిక కాబడిన 3 కేజీబీవీ కేంద్రాలలో (కేజీబీవీ వికారాబాద్, కేజీబీవీ దోమ మరియు కేజీబీవీ కోడంగల్) యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సెన్స్ లలో ఈనెల 12 తేదీన 6వ తరగతికి ప్రవేశ పరీక్ష నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎండి. అబ్దుల్ ఘని తెలిపారు. పరీక్ష ఉదయం 11.00 గంటల నుండి 1.00 గంట వరకు జరుగుతాయని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆరవ తరగతి నుండే జాతీయస్థాయిలో జేఈఈ, నీట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు అనుగుణంగా బోధన చేయబడునని తెలిపారు. మంచి హాస్టల్ వసతి, నాణ్యమైన బోధన, ఎస్ఓపి ద్వారా రుచికరమైన భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, వర్క్ బుక్స్, ఏకరూప దుస్తులు మరియు దుప్పట్లు తదితర వస్తువులు అందించబడును. విద్యార్థులకు అకాడమిక్ తో పాటు యోగ, కరాటే, ఆటలు, ప్రయోగశాలలు, గ్రంథాలయము, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, టైలరింగ్, కంప్యూటర్ బోధన, ఆర్ట్ క్రాఫ్ట్ వంటి కోర్సులు విద్యార్థులకు అందించబడును, పూర్తి వివరాలకు సంబంధిత కేజీబీవీ కేంద్రాలలో స్పెషలాఫీసర్లను సంప్రదించగలరని డిఈఓ తెలియజేయడం జరిగింది.

## ప్రాణదాతగా మారిన రోడ్డు ప్రమాద బాధితుడు - వేలాది కుటుంబాలకు అండగా



### జాస్తిపల్లి చల్లా సాయికుమార్

ఖమ్మం జిల్లా, కామేపల్లి : లోకల్ గైడ్, జులై 3 : ఒక చిన్న ప్రమాదం అతని జీవితాన్నే మార్చేసింది. ఆనాడు తాను పడిన రక్తం కష్టాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు వందలాది మంది తలసేమియా బాధితులకు, అత్యవసర రోగులకు ప్రాణదాతగా నిలుస్తున్నారు ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామానికి చెందిన యువకుడు చల్లా సాయికుమార్.

**ప్రమాదం నుంచి పుట్టిన సేవా దృక్పథం:**

2023లో జరిగిన ఒక భయానక కారు యాక్సిడెంట్ చల్లా సాయికుమార్ జీవితంలో పెద్ద మలుపుగా మారింది. ఆ సమయంలో తను అనుభవించిన నరకం, రక్తం కోసం ఆసుపత్రుల్లో రోగులు మరియు వారి కుటుంబాలు పడుతున్న అవస్థలు చూసి సాయి చలించిపోయారు. నాటి నుండి రక్తదానాన్ని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించారు. ఆర్థికంగా సహాయం చేయలేకపోయినా, అంతకన్నా అత్యంత విలువైన రక్తాన్ని అందించి ఎందరికో పునర్జన్మ ప్రసాదిస్తున్నారు.

**9 సార్లు రక్తదాన శిబిరాలు..**

**తలసేమియా పిల్లలకు అండ:**

సమయానికి రక్తం అందక తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్న పిల్లలు పడుతున్న వేదనను సాయి గుర్తించారు. తన మిత్ర బృందంతో కలిసి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 9 సార్లు భారీ రక్తదాన శిబిరాలను (బ్లడ్ క్యాంపులు) విజయవంతంగా నిర్వహించారు. ఎలాంటి పరిచయం లేని వ్యక్తులు ఆపదలో ఉన్నారని తెలిసినా, ఒక్క రూపాయి కూడా ఆశించకుండా వందలాది, వేలాది కుటుంబాలకు సాయికుమార్ అండగా నిలుస్తున్నారు.

**?"రక్తం చెట్ల నుండి రాదు.. జ్యూస్ సెంటర్లలో, వైన్ షాపుల్లో దొరకదు!"**

"రక్తదానం అనేది కేవలం ఒకరి ప్రాణం కాపాడటం మాత్రమే కాదు, అది మన బాధ్యత. డబ్బుతో కొనలేని సేవ ఏదైనా ఉందంటే అది రక్తదానమే. మనం ఎవరి కోసం రక్తం ఇస్తున్నామో తెలియకపోయినా, ఆ వ్యక్తి ప్రాణం నిలబడితే లభించే సంతృప్తి అమూల్యమైనది. యువతలో ఉన్న అపోహలను వీడి, భయం లేకుండా ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి."

--- చల్లా సాయికుమార్

అత్యవసర సమయంలో సాయికుమార్ విలువైన సూచనలు:

తొలి ప్రాధాన్యత కుటుంబానికే ఇవ్వండి: ఆపద సమయంలో ఎవరో వస్తారని, బ్లడ్ ఇస్తారని సమయాన్ని వృథా చేసుకోవద్దు. అత్యవసర పరిస్థితుల్లో ముందుగా మీ కుటుంబ సభ్యుల్లోనే బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయ్యే వారి కోసం వెతకండి. ఒక్కొక్కసారి రక్తదాతలు అందుబాటులో ఉండకపోవచ్చు.

?మనం ఇస్తేనే.. రేపు మనకు వస్తుంది: సమాజంలో ఒకరికొకరు సాయం చేసుకునే తత్వం ఉండాలి. ఎదుటివాడు ఆపదలో ఉన్నప్పుడు మనం రక్తదానం చేసి సాయపడితేనే, రేపు మనకు అవసరమైనప్పుడు మరొకరు ముందుకు వస్తారు.భవిష్యత్తును గుర్తుంచుకోండి:ఈరోజు వేరే ఎవరికో అవసరమైన రక్తం, రేపు ఏదో ఒక రోజు మీ కుటుంబంలో ఎవరికో ఒకరికి అవసరం పడొచ్చనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

మండల వ్యాప్తంగా ప్రశంసల జల్లు:ఎలాంటి స్వార్థం లేకుండా, సామాజిక స్పృహతో సాయికుమార్ చేస్తున్న ఈ మహోన్నత సేవలను బాధితుల కుటుంబాలు, గ్రామస్తులు, మరియు మండల వాసులు కొనియాడుతున్నారు. సాయికుమార్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని, ఆయన స్ఫూర్తితో యువత మరింతగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిస్తున్నారు.

## నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి అధికారులకు కలెక్టర్ ఆదేశం

## హౌసింగ్, సెర్ఫ్, పీఆర్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



నారాయణపేట జూలై 3:శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో హౌసింగ్, డీఆర్డీఏ ( సెర్ఫ్), పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించాలన్నారు. జిల్లాలో ఇంకా 767 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇండ్లను ఎందుకు నిర్మించుకోలేక పోతున్నారో లబ్ధిదారులతో కారణం రాయించుకుని వాటిని రద్దు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలకు 5 లక్షలు ఇస్తున్నా, ఇంకా ఎందుకు నిర్మించుకోవడం లేదని ఆమె విస్మయం వ్యక్తం చేశారు. మండలాల వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు, వివిధ దశల్లో ఉన్న ఇండ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఏఈ లకు ఇచ్చిన టార్గెట్ ను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో గుడిసెల లెక్కింపు సర్వే పూర్తి చేయాలన్నారు. గుడిసె ఉన్న ప్రతీ ఒక్కరు ఇందిరమ్మ ఇంటికి అర్హులు కాదని, గుడిసెలోనే వంట చేసుకుని జీవిస్తున్న వారికి ఇండ్లను మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కొన్ని గ్రామాల్లో కొంతమంది సొంత ఇల్లు ఉన్నా.. పక్కన ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుని ఉంటారని, అలాంటి వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయవద్దని తేల్చి చెప్పారు. రెండు వారాల తర్వాత మళ్ళీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో జిల్లాలో కొనసాగుతున్న పనుల గురించి చర్చించిన కలెక్టర్ గ్రామాలకు మంజూరైన వీ వో బిల్డింగ్ ల నిర్మాణాలు ఎంత వరకు వచ్చాయని ఏ ఈ లను ప్రశ్నించారు. జిల్లాకు ఇది వరకే 39 వీ వో బిల్డింగ్ లు మంజూరు కాగా వాటిలో ఒక్క బిల్డింగ్ కూడా పూర్తి కాకపోవడం దురదృష్టకరం అని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ 180 వీ వో బిల్డింగ్ లు మంజూరు అయ్యాయని, జిల్లాలోని అన్ని గ్రామాలలో వీ వో బిల్డింగ్ ల నిర్మాణాలను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఏఈల దినచర్య నివేదికను ఇవ్వాలని పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్ కు సూచించారు. అలాగే కొడంగల్ నియోజక వర్గ పరిధిలోని కోస్గి,మద్దూరు, గుండు మల్, కొత్త పల్లి మండలాలలో ఎంపీడీవోలు, ఏఈ లు వీ వో బిల్డింగ్ ల నిర్మాణానికి స్థల సేకరణ చేసి వెంటనే నిర్మాణాలను ప్రారంభింప చేయించాలని ఆదేశించారు. అన్ని గ్రామాలలో వీవో బిల్డింగ్ లు ఉండాలని ఆమె స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టి పూర్తి చేయించాలని పేమెంట్ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని, తప్పకుండా వస్తాయని ఆమె హామీ ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన గిడ్డంగుల నిర్మాణాల గురించి అడిగి తెలుసుకొని వాటి నిర్మాణాలను వేగంగా చేపట్టాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులను కూలీల సంఖ్య పెంచి వేగంగా చేయించాలన్నారు. ఉపాధి హామీ పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నెలకోసారి జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యుల సమావేశానికి ఎంపీడీవోలు తప్పని సరిగా హాజరు కావాలని, ఆ సమావేశాల ద్వారా సెర్ఫ్ కార్యకలాపాల గురించి తెలుస్తుందన్నారు. సెర్ఫ్ వింగ్ కు సంబంధించి మండలాల వారీగా ఎస్ హెచ్ జి గ్రూపుల వివరాలు, బ్యాంకు లింకేజీ టార్గెట్లు, స్త్రీ నిధి రికవరీ, ఎన్ పీ ఏ, ఎంటర్ ప్రైజెస్, స్కూల్ యూనిఫామ్స్ స్టిచ్చింగ్, కిషోర బాలికల సంఘాల ఏర్పాటు, యూడీఐడీ సర్టిఫికెట్ల గురించి కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో డీ ఆర్డీ ఏ వెంకట్ రాములు, ఇన్ ఛార్జ్ డీ ఎల్ పీ వో ఉదయ్ కుమార్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవో లు, పీఆర్ ఏ ఈ లు, డీపీఎంలు, ఏ పీ వో లు పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు.. 83 మందికి రూ.6.48 లక్షల జరిమానా



### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 45 మంది, లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 38 మందిపై కోర్టు జరిమానా

లోకల్ గైడ్ సిద్ధిపేట,జూలై 3: సిద్ధిపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 83 మందిపై కోర్టు మొత్తం రూ.6,48,500 జరిమానా విధించింది.సిద్ధిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చెట్టుక్రింది ముత్యం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 45 మంది పట్టుబడ్డారు. వీరిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించి మద్యం సేవించినట్లు నిర్ధారించడంతో సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా, వారికి కలిపి రూ.4,72,000 జరిమానా విధించారు.అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 38 మందికి కోర్టు రూ.1,76,500 జరిమానా విధించింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతర రోడ్డు వినియోగదారుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు.డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఒక్కొక్కరికి రూ.5,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

## ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం.



లోకల్ గైడ్ జడ్చర్ల జులై 3జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామపంచాయతీ లోని తిమ్మ రెంటి తండాకు చెందిన సభావత్ తార్యా కూతురు సంధ్య( అఖిల) వివాహానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని యువసేన సభ్యుల ద్వారా అందించిన బి ఆర్ ఎస్ పార్టీ యువనేత చించోడు అభిమన్యు రెడ్డి. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, రూప్ సింగ్ నాయక్, దివ్య నాయక్, రాజేష్ నాయక్, యువసేన సభ్యులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, తండా వాసులు తది తరులు పాల్గొన్నారు.

## కుకునూరుపల్లిలో బెల్ట్ షాప్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి.. 13.89 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం

### ఒకరు అరెస్ట్.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



లోకల్ గైడ్ కుకునూరుపల్లి, జూలై 3: సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బృందం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆకస్మిక దాడిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌ను గుర్తించి, 13.89 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుంది.నమ్మదగిన సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాపగోని వెంకట్ గౌడ్ (50) ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడిని కుకునూరుపల్లి పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై కుకునూరుపల్లి ఎస్ఐ బాలకృష్ణ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, గ్రామాల్లో అక్రమ బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించినా వెంటనే డయల్--100 లేదా టాస్క్‌ఫోర్స్ నంబర్ 8712667447కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## గ్రామదేవతల ఆశీస్సులు ఉండాలి

### ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



గండిపేట్, జూలై 3 (లోకల్ గైడ్ ): గ్రామ దేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీర్ లో బండ్లగూడ జాగీర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ వాన దేవత సహితీ కాటంరాజు విగ్రహ ప్రతిష్టోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించడంలో బండ్లగూడ జాగీర్ గౌడ సంఘం చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. శ్రీ కాటంరాజు వానదేవతల ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. గౌడ సామాజిక వర్గ అభివృద్ధికి, వారి సంక్షేమానికి తన వంతు సహకారం ప్రభుత్వ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, బండ్లగూడ జాగీర్ గౌడ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ను కలిసిన బొమ్మెర రామ్మూర్తి



ఖమ్మం :లోకల్ గైడ్ : ఖమ్మంలో పట్టణంలో శుక్రవారం నాడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మధిర నియోజవర్గ మాజీ ఇంచార్జ్ బొమ్మెర రామ్మూర్తి కలిశారు,

## ములుగు బస్టాండ్ ను సందర్శించిన ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్



ములుగు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ). మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు.ములుగు జిల్లా కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ ను ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది.. ఈ సందర్భంగా ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి సీతక్క ములుగు జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉందని అందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ని అభివృద్ధి చేస్తుందని అలాగే ఎటునాగారం లో బస్ డిపో ఏర్పాటు చేశారు అని అంతేకాకుండా ములుగు జిల్లా లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని వసంత శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముక్కెర లాలయ్య. ఎటునాగారం ఆరో వార్డు నెంబర్ ముమ్మినేని రమేష్. పి ఎస్ సి ఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్. కర్రీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ ఐ ఆర్ లో నిరక్షరాస్యులకు బి ఎల్ ఓ లు సహకరించాలి

### కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ



నారాయణపేట జూలై 3 : ఎన్నికల సంఘం జూన్ 25వ తేదీ నుండి ప్రారంభించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో నిరక్షరాస్యులకు బి ఎల్ ఓలు సహకరించి దగ్గరుండి ఫారాలు భర్తీ చేయాలని లేకపోతే ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉందనీ కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో కోరారు.కొందరు బి ఎల్ ఓ లు ఫారాలు ఇవ్వడమే తమ వంతు అని భర్తీ చేసే బాధ్యత ఓటర్లేనని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.అలాగే బిఎల్ఓ లకు 2002 నాటి ఓటర్ లిస్ట్ హార్డ్ కాపీలను తీసుకొని ఓటర్ల ఇంటికి వెళ్లి వాటిని సరి చూసే బాధ్యతను అధికారులకు అప్పగించాల ని అప్పుడే సరిగ్గా జరుగుతుందని అన్నారు.ఆన్లైన్ ప్రక్రియలో ప్రతి ఓటరు నిష్ణాతుడై ఉండవల సిన అవసరం లేదు కాబట్టి నిన్న మొన్న ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలలో నింపే ప్రక్రియలో పొరపాట్లు దొర్లే అవకాశం చాలా ఉంటుందన్నారు.దానివల్ల ఎన్నో అనుమానాలు అవరోధాలు ప్రక్రియలో ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లే బి ఎల్ వో చేతిలో 2002 నాటి ఓటర్ లిస్టును జతపర చాల్సిందిగా కోరారు. సొంత ఇల్లు ఉన్న పోలింగ్ స్టేషన్ నెంబర్ 148, 2002లో లేదు75 76 నంబర్లు మేల్ ఫిమేల్ విడివిడిగా ఉన్న కారణంగా ఓటర్లు తమంతట తాముగా 2002 ఓటర్ లిస్టు తో సరిచూసుకోలేకపోతున్నారన్నారు.సమస్య పట్టణంలోనే ఈ విధంగా ఉన్నప్పుడు జిల్లాలోని ప్రతి పల్లెలో ఈ సమస్య ఉంటుందని అన్నారు .పట్టణము నుండి 70 మంది బిఎల్వో లతో పాటు తో పాటు నియోజక వర్గంలోని 270 మంది బిఎల్ఓ లకు 2002 ఓటర్ లిస్టును హార్డ్ కాపీని ఇచ్చి తొలి దశలోనే పొరపాట్లు జరగకుండా చూసుకుంటే రాబోయే దశలో మరిన్ని పొరపాటు జరగకుండా ప్రక్రియ సరిగ్గా జరిగే అవకాశం ఉంటుందని అన్నారు.అంతేకాకుండా ఓటర్లు ఎక్కడ ఉన్న ఇంట్లో కొందరు లేకున్నా ఉన్నవాళ్లు లేని వారి వివరాలను పూర్తిగా రాసి తమ తమ ఓట్లను తామే రక్షించుకోవా లని అన్నారు.చనిపోయిన వారి ఓట్లను ను స్వచ్ఛందంగా తీసివేయిం చాలని, డబుల్ ఓట్లను సింగిల్ ఓట్లుగా మార్చాలని, భారతీయులు కానీ ఓటర్లను తొలగించాలని ఒక సమగ్ర భద్రత కల్పించాలనే ఉద్దేశంతో దేశంలో 1952 నుండి 14 సార్లు జరిగిన ఈ ప్రక్రియ విషయంలో ఎలాంటి అనుమానాలు ఆందోళనలు చెందకుండా ప్రక్రియ బిఎల్ఓ లతోపాటు రాజకీయ పార్టీల బిఎల్ఏలు కూడా మరీ ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ బిఎల్ఏలు పూర్తిగా సహకరించి ప్రక్రియ ను పూర్తి చేయాలని కోరారు.

## అంతర్జాతీయ సహకార వారోత్సవాలు: మెదక్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు




మెదక్ ప్రతినిధి జూలై 03( లోకల్ గైడ్ ). అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా, మెదక్ పిఎసిఎస్ (గాూజా) ఆధ్వర్యంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా వివిధ అంశాలపై చర్చలు మరియు పోటీలు జరిగాయి.ఈ కార్యక్రమానికి. మెదక్ పిఎసిఎస్ చైర్మన్ చిలుముల హనుమంత రెడ్డి,మెదక్ జిల్లా సహకార అధికారి శ్రీమతి పద్మ , ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సహకార వ్యవస్థ పనితీరుపై అవగాహన పెంచుకోవాలని, గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ . సాయిల్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందివిద్యార్థులు

## సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఖమ్మం....



**లోకల్ గైడ్. ఖమ్మంసైబర్ కేసులో నిందితురాలిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులుఆన్లైన్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 15 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కేరళలోని త్రివేండ్రం పట్టణంలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే....ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి వాట్సాప్ లో పరిచయమై ఆన్లైన్ లోఎనమ్ అసెట్ మేనేజ్మెంట్ పోర్టఫోలి లిమిటెడ్ కంపెనీ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్, ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 15 లక్షల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో " 2లక్షల రూపాయిలు, అదేవిదంగా వివిధ రాష్ట్రాలలో 38 క్రైమ్ లింక్స్ కేసులలో సుమారు 3 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగిన అకౌంటు హోల్డర్ మరియు అడ్వకేట్ అయిన ఆర్యదాస్ శైలజ ,వయస్సు 34 సం: లు కేరళ లోని త్రివేండ్రం సిటీలో అరెస్టు చేసి ఖమ్మం కి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తీసుకొచ్చి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఏస్పీ ఫణిందర్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఎస్సైలు రశీజిత్ కుమార్ , విజయ్ కుమార్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.**

## ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ పారదర్శకంగా నిర్వహించాలి- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి.

### ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను బీఎల్‌ఓ యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, (లోకల్ గైడ్ ): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) పారదర్శకంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా సేకరించిన వివరాలను బీఎల్‌ఓ యాప్‌లో స్పష్టంగా, ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. శుక్రవారం ఎల్.బి.నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎల్.బి.నగర్ జోనల్ అధికారి వికాస్ మహతో తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమం కొనసాగుతోందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయడంతోపాటు ఆ వివరాలను వెంటనే బీఎల్‌ఓ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను సేకరించి, అందులో పొందుపరిచిన వివరాలను యాప్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు, నకిలీ నమోదులు లేదా అనర్హుల పేర్లు లేకుండా అత్యంత పారదర్శకంగా, విశ్వసనీయంగా ఓటరు జాబితాను రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న సర్వే విధానం, ఫారాల పంపిణీ, యాప్‌లో నమోదు ప్రక్రియ, పూర్తి చేసిన ఫారాల సేకరణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన ఆధార పత్రంగా ఉంటుందని పేర్కొన్న కలెక్టర్, ప్రతి నమోదు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన ఓటర్ల పేర్లను సంబంధిత ఆధారాలతో తొలగించడం, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఈపీఐసీ కార్డులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం, నివాసం మారిన వారి వివరాలను సక్రమంగా నవీకరించడం వంటి అంశాలను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండేలా చర్యలు చేపట్టి, ఖచ్చితమైన, తప్పులేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడమే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషిస్తున్నందున వారు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపే సమయంలో ఓటర్లు సరైన వివరాలను అందించాలని, అవసరమైన పత్రాలను జతచేయాలని, అధికారులు కోరిన సమాచారాన్ని పూర్తిగా అందించడం ద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

బీఎల్‌ఓ యాప్‌లో నమోదయ్యే ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని, సాంకేతికపరమైన పొరపాట్లు, డేటా ఎంట్రీలో తప్పిదాలు, వివరాల లోపాలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి అధికారి, బీఎల్‌ఓ కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, ఎల్.బి.నగర్ మున్సిపల్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ , జిల్లా యాదవ సంఘం నాయకులు



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 3 : సింగరేణి మండలం రేగులాగూడెం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఆవుల సత్యనారాయణ యశోద లా పెద్ద కుమార్తె ఆవుల శిరీష – నరేందర్ ల వివాహమునకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరయ్యి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ మంచిగా ఒకరిని ఒకరు అర్ధం చేసుకొని అన్యోన్యంగా ఉండి ఆదర్శం గా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లోకాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల , మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు , సర్పంచ్ లు మోతి వీరాస్వామి , మేదరి వీర ప్రతాప్ , బానోత్ హీరాలాల్ , భూక్యా రంజిత్ కుమార్ , పూసం ఎల్లయ్య , భూక్యా బాలు , కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకత్వం అడ్డగోడ ఐలయ్య , మాలోత్ భావసింగ్ , జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, కారేపల్లి సోసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్ , రాష్ట్ర జర్నలిస్ట్ సంఘం నాయకులు ఏడుకొండలు, సత్యనారాయణ, పిట్టల వెంకటేశ్వర్లు (ఇస్తారు ), గ్రామ పెద్దలు , నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏదుల రిజర్వాయర్ ముంపు బాధితులకు అండగా ఉంటా...

--- 47 మంది బాధితులకు రూ.2.34 కోట్ల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే.



వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 3 :ఏదుల రిజర్వాయర్ ముంపు బాధితుల కు ఎల్లప్పుడు అండగా ఉంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బరోసా ఇచ్చారు. శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 47 మంది ముంపు బాధితులు ఇండ్లు నిర్మించుకోవడం కోసం రూ: 2.34 కోట్ల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. వనపర్తి నియోజకవర్గంలోని ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ముంపుకు గురైన కొంకలపల్లి గ్రామానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల 34 లక్షలను మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి తమ పొలాలు, ఇండ్లు కోల్పోయి పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చిందని, ఎన్న...

## పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం..
## -పక్నృతి అందాలకు పిదా అవుతున్న పర్యాటకులు..



వాజేడు, లొకల్ గైడ్ ప్రతినిధి :- పర్యాటక కేంద్రాలకు ప్రసిద్ధిగాంచిన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి బొగత జలపాతం అందాలను వెదజల్లుతూ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. గత కొద్ది నెలలుగా బోగత జలపాతం లో నీరు లేకపోవడంతో వేలవేలబోయిన జలపాతం ఇటీవల వాజేడు మండలం ఛత్తీస్గడ్ అడవుల్లో కురిసిన వర్షాలకు వరద నీరు అత్యధికంగా జలపాతం లోకి చేరడంతో బోగతకు జలకళ ఉట్టి పడుతుంది.చుట్టూ పచ్చని అటవీ ప్రాంతం పక్షుల కేరింతల నడుము సుమారు 50 అడుగుల ఎత్తు నుండి వరద నీరు బొగత లోయలోకి జాలువారుతుంటే తుంపర్లు ఎగిసిపడుతూ అందాలను వెదజల్లుతుంది. ఈ బోగతా అందాలు చూడతరమా అనే విధంగా పర్యటకులను కనువిందు చేస్తున్నాయి.బొగత అందాలకు ఆకర్షితులవుతున్న పర్యాటకులుతెలంగాణ మినీ నయాగారా జలపాతంగా పేరు గాయించబడిన చీకుపల్లి బోగత జలపాతం అందాలకు రాష్ట్ర నలుమూలల నుండి పర్యాటకులు ఆకర్షితులై అందాలను వీక్షించడానికి వేల సంఖ్యలో తరలి వస్తున్నారు. బోగత అందాలను వీక్షిస్తూ చక్కటి ఆహ్లాదాన్ని పొందుతున్నారు కుటుంబ సమేతంగా పిల్లాపాపలతో కలసి బొగత జలపాతం ప్రాంగణానికి చేరుకొని రోజంతా ఆ ప్రాంతంలో గడుపుతూ చక్కటి వాతావరణం మధ్య ఆహ్లాదాన్ని పొందుతున్నారు. బోగత జలపాతం సందర్శించే పర్యాటకులకు అన్ని అటవీశాఖ అధికారులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జోన్-7 జోగులాంబ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్,




మిడ్జిల్ జులై 3(లోకల్ గైడ్ ):తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ గ్రామ పర్యటన నేపథ్యంలో భద్రతా మరియు ఇతర ఏర్పాట్లను జోన్–7 జోగులాంబ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ఇతర బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.అనంతరం డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువు కాలువపై అక్రమ కట్టడం కూల్చివేతకు మున్సిపల్ చర్యలు



లోకల్ గైడ్:ఆమనగల్లు, జూలై 3 రంగారెడ్డి జిల్లాఆమనగల్లు పట్టణంలోని 7వ వార్డులో ప్రభుత్వ చెరువు కాలువపై అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం కూల్చివేశారు.స్థానికుల ఫిర్యాదుల మేరకు చెరువు కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాన్ని తొలగించారు.ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు మరియు రహదారులను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎవరూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించవద్దని, పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామదేవతల ఆశీస్సులు ఉండాలి ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



గండిపేట్, జూలై 3 (లోకల్ గైడ్ ): గ్రామ దేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ లో బండ్లగూడ జాగిర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ వాన దేవత సహితీ కాటంరాజు విగ్రహ ప్రతిష్టోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించడంలో బండ్లగూడ జాగీర్ గౌడ సంఘం చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. శ్రీ కాటంరాజు వానదేవతల ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. గౌడ సామాజిక వర్గ అభివృద్ధికి, వారి సంక్షేమానికి తన వంతు సహకారం ప్రభుత్వ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, బండ్లగూడ జాగీర్ గౌడ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

జూలై 10లోగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది




లోకల్ గైడ్ సిద్దిపేట జూలై 3:ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి 2026 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తుదారులు ఆన్లైన్ ద్వారా జూలై 10, 2026లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అనంతరం స్వీయ నామినేషన్ ప్రక్రియను జూలై 13, 2026లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుకు సంబంధించిన ఒరిజినల్ హార్డ్ కాపీతో పాటు ఒక జిరాక్స్ సెట్‌ను జూలై 13, 2026లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జీవో 641 రద్దు చేసే వరకు డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమం ఆగదు

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌పై బీఆర్ఎస్ కార్యాచరణ ప్రారంభం



( లోకల్ గైడ్ షాద్నగర్ )సిద్దాపూర్ గ్రామంలో జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (డంపింగ్ యార్డ్) ఏర్పాటు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 641పై భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఈరోజు షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో సిద్దాపూర్, పరిసర గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం జీవో నం. 641ను జారీ చేయడం ప్రజావ్యతిరేక నిర్ణయమని విమర్శించారు. డంపింగ్ యార్డ్ జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, జీవో 641 ఉపసంహరించుకునే వరకు ప్రజలతో కలిసి అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా ప్రజలను చైతన్యపరుస్తూ, అవసరమైతే భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సిద్దాపూర్ ప్రజల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడతామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, మాజీ జడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మెండే కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నటరాజన్, సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచులు వడ్డె బాలయ్య, రమేష్, చంద్రశేఖర్ తదితరులు, ఆయా గ్రామాల, తండాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
## కుందేలు కుంట తండా సర్పంచ్ మేఘవత్ లక్ష్మి లక్ష్మణ్ నాయక్

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో బోర్లు వేయించడం జరిగింది



(లోకల్ గైడ్ షాద్ నగర్ )ఫరూక్నగర్ మండలం కుందేలు కుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని దేవుని గుట్ట తండా మరియు పోతారాజ్ గడ్డ తండా త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో తాండ సర్పంచ్ మెగావత్ లక్ష్మి లక్ష్మణ్ నాయక్ మరియు షాద్నగర్ మాజీ శాసనసభ్యులు అంజయ్య యాదవ్ సహకారంతో తాండాలో రెండు బోర్లను వేయించడం జరిగింది. బోర్లు పూర్తి అయిన తర్వాత మోటర్లు బిగించి మీరు అందించడంతో తండ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ రాము కేతావత్ రవి, సభవత్ శివ, కేతావత్ సూర్య, సభవత్ పెంత్య, కేతావత్ రాజు, మేఘవత్ రమేష్, మేఘవత్ లోక, ఉమ్మడి బూర్గుల మాజీ సర్పంచ్ పిర్యా నాయక్, తర్యా, మరియు యువకులు మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## అక్బర్‌పేట భూంపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గూండా శంకర్ బాధ్యతలు

చెరుకు శ్రీనివాస్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు



లోకల్ గైడ్ అక్బర్‌పేట భూంపల్లి జూలై 3:అక్బర్‌పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన గూండా శంకర్, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా గూండా శంకర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జి వివేక్ వెంకటస్వామి గారికి, అలాగే దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని మండలంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బేగంపేట గ్రామ సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, నగరం గ్రామ ఉప సర్పంచ్ రమేశ్, జిల్లా కార్యదర్శి ఎల్లన్న సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్, ఖాజీపూర్ మాజీ సర్పంచ్ పెరిక మధు, సోలిపేట ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బైండ్ల కుల ధ్రువీకరణ పత్రాల జారీపై రాష్ట్ర ప్రభుత్వానికి బైండ్ల సంఘం కృతజ్ఞతలు



లోకల్ గైడ్ తొగుట జూలై 3: రాష్ట్ర ప్రభుత్వం బైండ్ల కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం పట్ల బైండ్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బైండ్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైండ్ల పరశు రాములు, జిల్లా కోశాధికారి బైండ్ల రవీందర్, మండల అధ్యక్షుడు బైండ్ల మురళి ఆధ్వర్యంలో తొగుట మండల తహసీల్దార్ మహమ్మద్ సమీర్ అహ్మద్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణిలను పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, తమ తాతలు, ముత్తాతల కాలం నుంచి బైండ్ల కులవృత్తినే ఆధారంగా జీవనం సాగిస్తున్న తమకు ప్రభుత్వం బైండ్ల కుల ధ్రువీకరణ పత్రాలు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రాల కోసం అనేక దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పుడు న్యాయం జరగడం సంతోషకరమని పేర్కొన్నారు.నూతన రిజర్వేషన్ విధానం ద్వారా బైండ్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనార్ధన్, సుధాకర్, యాదగిరి, రమేష్, రంజిత్, గణేష్, రామస్వామి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## . రేడియల్ రోడ్డు--
## 2 భూసేకరణపై రైతులతో అధికారుల చర్చలు.


. పరిహారానికి రైతుల సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు అధికారుల వెల్లడి.




రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): శంషాబాద్ నుంచి నాచారం ఎన్ హెచ్ 167 వరకు నిర్మించే రేడియల్ రోడ్డు నిర్మాణానికి కావలసిన భూసేకరణ పై రైతులతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం శంషాబాద్--షాద్‌నగర్ డివిజన్ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రేడియల్ రోడ్డు--2 (బుద్వేల్ ఓ ఆర్ ఆర్ నుంచి నాచారం ఎన్ హెచ్ --167ఎన్ వరకు) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అంశంపై రైతులతో విస్తృతంగా చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో షాద్ నగర్ డివిజన్ పరిధిలోని కొందుర్గు మండలంలోని ముట్‌పూర్, చుక్కమెట్, ఉమ్మెత్యాల్, లాలాపేట్ గ్రామాల రైతులు, చౌదర్‌గూడ మండలంలోని తుమ్మపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సరిత, సంబంధిత రెవెన్యూ అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రేడియల్ రోడ్డు--2 నిర్మాణం వల్ల కలిగే ప్రజా ప్రయోజనాలు, ప్రాంతీయ అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, భూసేకరణ విధానం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించే పరిహారం తదితర అంశాలను రైతులకు వివరించారు. రైతులు కూడా తమ అభిప్రాయాలు, సందేహాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చర్చలు సానుకూల వాతావరణంలో కొనసాగగా, ప్రభుత్వం ప్రతిపాదించిన కన్సెంట్ అవార్డు ద్వారా భూసేకరణ పరిహారం స్వీకరించేందుకు రైతులు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. నిర్ణయించిన నిబంధనల మేరకు పరిహారం అందుకున్న అనంతరం రేడియల్ రోడ్డు--2 నిర్మాణం కోసం అవసరమైన భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు కూడా తమ సమ్మతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల హక్కులు, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రేడియల్ రోడ్డు--2 నిర్మాణం పూర్తయితే షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని, పారిశ్రామిక, వాణిజ్య, రవాణా రంగాల పురోగతికి ఇది కీలకంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహకరించిన రైతులను అభినందించారు.సమావేశం పరస్పర అవగాహనతో, సానుకూల చర్చలతో విజయవంతంగా ముగిసిందని, భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రేడియల్ రోడ్డు--2 ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపడతారని తెలిపారు.

# రేడియల్ రోడ్డు-- 2 భూసేకరణపై రైతులతో అధికారుల చర్చలు

పరిహారానికి రైతుల సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు అధికారుల వెల్లడి




రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): శంషాబాద్ నుంచి నాచారం ఎన్ హెచ్ 167 వరకు నిర్మించే రేడియల్ రోడ్డు నిర్మాణానికి కావలసిన భూసేకరణ పై రైతులతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం శంషాబాద్-- షాద్‌నగర్ డివిజన్ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రేడియల్ రోడ్డు--2 (బుద్వేల్ ఓ ఆర్ ఆర్ నుంచి నాచారం ఎన్ హెచ్ --167ఎన్ వరకు) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అంశంపై రైతులతో విస్తృతంగా చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో షాద్ నగర్ డివిజన్ పరిధిలోని కొందుర్గు మండలంలోని ముట్‌పూర్, చుక్కమెట్, ఉమ్మెత్యాల్, లాలాపేట్ గ్రామాల రైతులు, చౌదర్‌గూడ మండలంలోని తుమ్మపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) సరిత, సంబంధిత రెవెన్యూ అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రేడియల్ రోడ్డు--2 నిర్మాణం వల్ల కలిగే ప్రజా ప్రయోజనాలు, ప్రాంతీయ అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, భూసేకరణ విధానం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించే పరిహారం తదితర అంశాలను రైతులకు వివరించారు. రైతులు కూడా తమ అభిప్రాయాలు, సందేహాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చర్చలు సానుకూల వాతావరణంలో కొనసాగగా, ప్రభుత్వం ప్రతిపాదించిన కన్సెంట్ అవార్డు ద్వారా భూసేకరణ పరిహారం స్వీకరించేందుకు రైతులు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. నిర్ణయించిన నిబంధనల మేరకు పరిహారం అందుకున్న అనంతరం రేడియల్ రోడ్డు--2 నిర్మాణం కోసం అవసరమైన భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు కూడా తమ సమ్మతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల హక్కులు, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రేడియల్ రోడ్డు--2 నిర్మాణం పూర్తయితే షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని, పారిశ్రామిక, వాణిజ్య, రవాణా రంగాల పురోగతికి ఇది కీలకంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహకరించిన రైతులను అభినందించారు. సమావేశం పరస్పర అవగాహనతో, సానుకూల చర్చలతో విజయవంతంగా ముగిసిందని, భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రేడియల్ రోడ్డు--2 ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపడతారని తెలిపారు.

# వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు వినియోగించాలి


వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ఫా శ్రీనివాసరావు



ములుగు జిల్లా ప్రతినిధి వెంకటాపురం (లోకల్ గైడ్):వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వెంకటాపురం వాజేడు చర్ల రైతులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలియజేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ఈ సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలు, ధ్రువీకరించిన ఎరువులు మాత్రమే వినియోగించాలి. వర్షపాతం, నేల స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేపట్టాలి.పొలాల్లో నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు, తెగుళ్లు మరియు చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖ సూచించిన పద్ధతులనే అనుసరించాలి. అనవసర ఖర్చులు తగ్గించి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలి.రైతులు తమ పంటలను వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా విక్రయించి పారదర్శకమైన విధానంలో గిట్టుబాటు ధర పొందాలని కోరుతున్నాను. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పంట బీమా వంటి అవకాశాలను తప్పకుండా వినియోగించుకోవాలి.ఈ వ్యవసాయ సీజన్‌లో ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి మంచి దిగుబడులు రావాలని తగు సూచనలు చేశారు .

# సమర్థవంతమైన పోలీసింగ్, ప్రజలకు జవాబుదారీతనం పెంపొందించాలి

పోలీస్ అధికారులకు డీజీపీ దిశానిర్దేశం




నారాయణపేట జూలై 3: తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో సమర్థవంతమైన పోలీసింగ్ ప్రమాణాల అమలు, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, జవాబుదారీతనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ సి వి ఆనంద్ పోలీస్ అధికారులకు సూచించారు.శు క్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ పోలీసు అధికారులు ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత వైఖరి పాటించాలని, పాత విధానాలను వదిలి ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా మారాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రత, మహిళలు మరియు చిన్నారుల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ తో పాటు జిల్లాలోని అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు మహేష్ , నల్లపు లింగయ్య, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన సమావేశం

డాక్టర్ గోదా విష్ణు రెడ్డి...



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై(లోకల్ గైడ్ న్యూస్):ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా, తప్పులేకుండా పూర్తి చేయాలనే లక్ష్యంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుమార్తె డాక్టర్ శ్రీగోదా విష్ణు రెడ్డి బీఎల్‌ఏలకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 6, 49, 50, 52, 53, 54 డివిజన్ల పరిధిలోని బీఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమై ఎన్యుమరేషన్ ఫారాలను సరైన విధంగా నింపడం, ఓటర్ల వివరాలను పొరపాట్లు లేకుండా నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేయడం, 2002 ఓటరు జాబితాను ప్రస్తుత పోలింగ్ స్టేషన్ నంబర్లతో సరిపోల్చే విధానంపై సవివరంగా అవగాహన కల్పించారు.అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచిస్తూ, ప్రతి అర్హత కలిగిన ఓటరికి సరైన మార్గదర్శకత్వం అందించి ఎలాంటి లోపాలకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్‌ఏలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ ఇన్‌చార్జీలు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు), సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పసికందు అపహరణ... అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో తల్లి ఒడిలో నుంచి నెల రోజుల చిన్నారి అపహరణ

రూ.1.50 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం.. ఐదుగురు అరెస్టు

మూడురోజుల గాలింపుతో చిన్నారిని రక్షించిన చందానగర్ పోలీసులు




శేరిలింగంపల్లి, జూలై 3 (లోకల్ గైడ్):లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న తల్లి ఒడిలో నుంచి నెల రోజుల పసికందును అపహరించి విక్రయించేందుకు పన్నిన అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠాను చందానగర్ పోలీసులు ఛేదించారు. తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, అపహరణకు గురైన చిన్నారిని మూడురోజుల్లోనే రక్షించి కన్నతల్లి ఒడికి చేర్చారు. సీసీ కెమెరాల ఆధారంగా సాగిన దర్యాప్తుతో శిశు అక్రమ రవాణా ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది.కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బాల్కి గ్రామానికి చెందిన సర్కస్ కళాకారిణి మలన్ బౌరవ్ శాంతాబాయి తన బృందంతో కలిసి లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా, జూన్ 30 తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఆటోరిక్షాలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె ఒడిలో ఉన్న నెల రోజుల చిన్నారిని బలవంతంగా ఎత్తుకెళ్లారు. చిన్నారి ఏడుపు వినిపించడంతో మేల్కొన్న తల్లి వెంటపడినా, అప్పటికే నిందితులు ఆటోలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీ కెమెరాలే ఆధారంఆర్‌సీ పురం ఏసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్, అమీన్‌పూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, చందానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. భాస్కర్ నేతృత్వంలోని బృందాలు సైబరాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోని వందలాది సీసీ కెమెరాల దృశ్యాలను మూడు రోజులపాటు క్షుణ్ణంగా పరిశీలించి నిందితుల జాడ కనిపెట్టాయి. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని చిన్నారిని సురక్షితంగా రక్షించాయి.రూ.1.50 లక్షలకు బేరందర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూశాయి. కోల్‌కతాకు చెందిన రెహనుమా అలీకి సంతానం లేకపోవడంతో డబ్బు చెల్లించి నవజాత శిశువును సమకూర్చాలని తన బంధువు నిమ్మీ జహాన్ అలియాస్ సీమను కోరింది. ఆమె ఈ విషయాన్ని నేరేడ్‌మెట్‌కు చెందిన సాదికా మక్సూద్ అలియాస్ నజియాకు చెప్పగా, నజియా తన కాబోయే భర్త మహ్మద్ జుబేర్‌ను సంప్రదించింది. అనంతరం జుబేర్, అతని సహచరుడు మహ్మద్ ఇర్ఫాన్‌తో కలిసి పసికందును అపహరించి విక్రయించేందుకు కుట్ర పన్నాడు. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న తల్లి ఒడిలోని చిన్నారిని లక్ష్యంగా చేసుకుని అపహరణకు పాల్పడ్డారు.చిన్నారిని నజియా ఇంటికి తరలించిన అనంతరం కోల్‌కతా నుంచి విమానంలో హైదరాబాద్‌కు వచ్చిన రెహనుమా అలీకి అప్పగించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అక్రమ లావాదేవీ కోసం ప్రధాన నిందితుడు జుబేర్ ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా రూ.1.50 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. అయితే చిన్నారిని కోల్‌కతాకు తరలించేలోపే పోలీసులు నిందితులను పట్టుకుని శిశువును రక్షించారు.ఈ కేసులో మహ్మద్ జుబేర్, మహ్మద్ ఇర్ఫాన్, సాదికా మక్సూద్ అలియాస్ నజియా, నిమ్మీ జహాన్ అలియాస్ సీమ అలీ, రెహనుమా అలీలను అరెస్టు చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు బాలల న్యాయ చట్టం (జువెనైల్ జస్టిస్ చట్టం)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠా కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని పోలీసులు తెలిపారు.

# బేతుపల్లి రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్


ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించి రీ సర్వే చేయాలి


ప్రభుత్వ భూములు, రహదారులు, ప్రజా స్థలాల వివరాలు కోఆర్డినేట్లతో నమోదు చేయాలి

రోజుకు ప్రతి బృందం 50 నుండి 60 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలి

సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ సమాంతరంగా కొనసాగాలి

సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలో చేస్తున్న రీ సర్వే అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్






ఖమ్మం, సత్తుపల్లి జూన్ - 03 :లోకల్ గైడ్ :బేతుపల్లి రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డుల తయారీ లక్ష్యంగా బేతుపల్లి గ్రామంలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, బేతుపల్లి గ్రామంలో భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ప్రతి రైతుకు రీ సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, వారి సమక్షంలోనే పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. రీ సర్వే ద్వారా భూముల విస్తీర్ణాలు, హద్దులు, యాజమాన్య వివరాలను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేసి భూ రికార్డులను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు.రీ సర్వే నిర్వహణ కోసం గ్రామంలో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్‌తో పాటు ఇద్దరు జీపీవోలు పనిచేస్తారని చెప్పారు. రైతు వేదికను కేంద్రంగా ఉపయోగించుకుని అక్కడే కంప్యూటర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను వెంటనే డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను పాటించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువులు, కాలువలు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల స్థలాలను కోఆర్డినేట్లతో సహా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించి పంచనామాలు నిర్వహించి ఖచ్చితమైన రికార్డులు సిద్ధం చేయాలని తెలిపారు.ప్రతి బృందం రోజుకు 50 నుంచి 60 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలని, పది బృందాలు కలిసి రోజుకు సుమారు 500 నుంచి 600 ఎకరాల వరకు సర్వే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి, రైతుల సమక్షంలో భూ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు ప్రతిరోజూ సర్వే పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సర్వే పూర్తయ్యే వరకు డేటా ఎంట్రీ, డిజిటల్ మ్యాప్ తయారీ ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగాలని స్పష్టం చేశారు.రీ సర్వే వల్ల ఏ రైతు తన భూమి విస్తీర్ణాన్ని కోల్పోయే పరిస్థితి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా జరుగుతుందని రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రతి రైతును గ్రామ సభలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు.క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి వివాదాలకు తావులేకుండా రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు.ఈ పరిశీలనలో సత్తుపల్లి తహసీల్దార్, తిరుమలాయపాలెం తహసీల్దార్ విల్సన్, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సొంతింటి కలను సాకారం చేస్తుంది.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.చెంద్రశేఖర్.

పిర్జాపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ గృహ ప్రారంభోత్సవం.



లోకల్ గైడ్,జిల్లేడు చౌదరి గూడెం.:కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి లబ్ధిదాడికి సొంత ఇంటి కలను సాకారం చేస్తుందని జిల్లేడు చౌదరి గూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చెంద్రశేఖర్ అన్నారు.జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని పీర్జాపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ గృహాన్ని శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహహీనులకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా వేలాది పేద కుటుంబాలు సొంతింటి యజమానులుగా మారుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నర్సింలు, బంధయ్య, మాజీ సర్పంచులు బాలరాజ్, నర్సింలు, పాపయ్య, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, ఆంజనేయులు, నవీన్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు

# రేవంత్ రాజకీయ ప్రస్థానానికి ప్రతీకగా మిడ్జిల్ సభ

ప్రతి కార్యకర్త సమన్వయంతో విజయవంతం చేయాలి: డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్



మిడ్జిల్ జులై 4 (లోకల్ గైడ్ ):మిడ్జిల్ మండల కేంద్రంలో జూలై 4న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణం, వేదిక, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను అధికారులతో, పార్టీ నాయకులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీగా ప్రజా జీవితాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం మిడ్జిల్ ప్రజలకు గర్వకారణమని అన్నారు. జెడ్పీటీసీగా ప్రజా సేవ ప్రారంభించి, ఎమ్మెల్యే, ఎంపీగా ప్రజల ఆదరణ పొందుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన ఆయన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభ చారిత్రాత్మకంగా నిలవబోతోందని పేర్కొన్నారు.మిడ్జిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధాన్ని ప్రజలకు గుర్తు చేసే సభగా దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే వేదికగా ఈ సభ నిలుస్తుందని చెప్పారు. జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సభకు తరలివచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలు, రైతులు, యువత, పార్టీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులకు ఆదేశించారు. సభ విజయవంతం కావడం ద్వారా మిడ్జిల్ రాజకీయ ప్రాధాన్యత మరింత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.అనంతరం సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, వేదిక నిర్మాణం, బ్యారికేడ్లు, వాహనాల పార్కింగ్, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, భద్రతా చర్యలపై సంబంధిత నాయకులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఏపీ మిథున్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీ మినాజుద్దీన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ బంగ్లా రవి, లీగల్ సెల్ వైస్ చైర్మన్ శ్రీ జి. రాజేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీ గౌస్ రబ్బానీ, యూత్ కాంగ్రెస్ నాయకురాలు సంధ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీ వెంకటయ్య, శ్రీ బి. వెంకటేశం, మిడ్జిల్ మండల నాయకుడు అల్వాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గౌస్ ,సంపత్ కుమార్ ,మీనాజ్,శంకర్ నాయక్ ,నరేందర్ రెడ్డి శంకర్ నాయక్ కోట్ల పర్వతాలు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శంకరన్న సహకారంతోనే గ్రామాల్లో వేగవంతంగా అభివృద్ధి పనులు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చెంద్రశేఖర్.

.ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పిర్జాపూర్ గ్రామపంచాయతీలో నూతన భవనానికి భూమిపూజ.




లోకల్ గైడ్, జిల్లేడు చౌదరిగూడెం. మన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న సహకారంతోనే జిల్లేడు చౌదరిగూడ మండలంలోని అభివృద్ధి పనులు వేగవంతంగా ముందుకు సాగుతున్నాయని జిల్లేడు చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్. చెంద్ర శేఖర్ అన్నారు.పిర్జాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) నిధులతో నిర్మించనున్న గ్రామపంచాయతీ నూతన భవనానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ ఎన్. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎన్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో గ్రామపంచాయతీ భవనాలను నిర్మిస్తోందన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామ స్వరాజ్య వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నర్సింలు, బంధయ్య, మాజీ సర్పంచులు బాలరాజు, నర్సింలు, పాపయ్య, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, ఆంజనేయులు, నవీన్‌తో పాటు గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ నాగన్నకు విప్లవ జోహార్లు ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు కే. నరేంద్ర



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 3 : విప్లవ పాటల పెద్దన్న, ప్రజా గొంతుక, అరుణోదయ అనే ఇంటి పేరుగా మార్చుకున్న అరుణోదయ నాగన్న గా పేరొందిన నాగన్న మరణం ప్రజాపాటలకి, ప్రజా సమస్యలపై నిత్యం తన గళం లో వినిపించిన అరుణోదయ నాగన్న మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కే.నరేంద్ర , జిల్లా కమిటీ సభ్యులు కరకపల్లి రాయమల్లు , రాచర్ల రణధీర్ , పాయం వెంకన్న, బచ్చల వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదం సామ్రాజ్యవాదం పేట్రేగిపోతున్న వేళ నాగన్న వంటి కళాకారులు ప్రజల మధ్య లేకుండా పోవడం ప్రజా చైతన్యానికి ఎదురు దెబ్బ వంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి అరుదైన కళాకారుడికి ప్రజానాట్యమండలి (పీ ఎన్ ఎం ) ఖమ్మం జిల్లా కమిటీ వైరా డివిజన్ కమిటీ కారేపల్లి మండల కమిటీ వైపు నుంచి విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లుఅర్పిస్తు మృతికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూ తెలిపారు.

# చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై03(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ ,మాతృత్వం ఒక వరమని అందుకు పిల్లలు లేని దంపతులకు చట్టబద్ధమైన దత్తత ఉత్తమ మార్గం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.శుక్రవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అనుబంధ ప్రత్యేక దత్తత విభాగం కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నియమ నిబంధనలకు ఎంపికైన నాలుగు నెలల శిశువు, పదహారు సంవత్సరాల బాలుడి దత్తతను హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి చెందిన దంపతులు, రాజన్న సిరిసిల్ల జిల్లాకి చెందిన దంపతులకు దత్తత కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా దత్తత తీసుకోవాలని అన్నారు. అక్రమ దత్తత తీసుకోవడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడొద్దని పేర్కొన్నారు. పిల్లలను దత్తత తీసుకున్న దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ, బాల రక్ష భవన్ కో ఆర్డినేటర్ అవంతి, సోషల్ వర్కర్ సంగి చైతన్య, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఆశ, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# కంభం రోడ్డు ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి




తాడేపల్లి: కంభం పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి సహా నలుగురు మృతి చెందడం పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెళ్లి వేడుకకు హాజరై ఆలయానికి వెళ్లిన వారు ఈ విధంగా ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. వివాహ వేడుకల ఆనందం నిండిన కుటుంబంలో ఇలాంటి పెను విషాదం నెలకొనడం హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తీవ్రంగా గాయపడినవారి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. కాగా, మార్కాపురం జిల్లా కంభం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో కూడిన ఆటోను లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, 8 మంది గాయపడ్డారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం విషాదం నింపింది. మృతి చెందిన వారిలో అలకనంద (19), అంకాలు (20), నగేశ్ (17) , నాగేశ్వరి (2) గిద్దలూరు నల్లబండ బజారు వాసులుగా గుర్తించారు. కాగా పెళ్లి కూతురు వీరక్కకు తీవ్ర గాయాలయ్యాయి.

# పొగాకు రైతుల పరిస్థితి వర్ణనాతీతం: కాకాణి



ప్రకాశం: దేశ చరిత్రలో ఎన్డీయే ప్రభుత్వం రైతులను మోసం చేసినట్టు ఎవరు చేయలేదన్నారు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి. రాష్ట్రంలో పొగాకు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. ప్రభుత్వం తక్షణమే పొగాకు రైతులను ఆదుకోవాలని కాకాణి డిమాండ్ చేశారు. పొగాకు కంపెనీలతో చంద్రబాబు, లోకేష్ లాలూచీ పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడాం. పొగాకు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. దేశ చరిత్రలో ఎన్డీయే ప్రభుత్వం రైతులను మోసం చేసినట్టు ఎవరు చేయలేదు. పొగాకు ధర క్వింటాకు 16వేలకు పడిపోయింది. ఇంత దారుణం ఎప్పుడు జరగలేదు. పొగాకు కొనుగోలులో కూడా అవకతవకలు జరిగాయి. రెఫరెన్స్‌లు ఇవ్వడం దారుణం. తమకు అనుకూలమైన వారి బేళ్లు ఎక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటకలో పొగాకు క్వింటా ధర 36 వేలు.. ఆంధ్రలో 16 వేలు. దీనికి కారణం ఎవరు?. పొగాకు కంపెనీలతో చంద్రబాబు, లోకేష్ లాలూచీ పడ్డారు. తక్కువకు రైతుల దగ్గర కంపెనీలకు కట్టబెట్టి.. కంపెనీ నుండి చంద్రబాబు, లోకేష్ లబ్ధి పొందే ప్రయత్నం. ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు. చంద్రబాబు వరి తినకపోతే ఇంకెవరు తినేవాళ్ళు లేరా?. ప్రజలను చంద్రబాబు తప్పు దారి పట్టిస్తున్నాడు. పొగాకు రైతులు భారీగా నష్టపోతున్నారు. తక్షణమే పొగాకు రైతులను ఆదుకోవాలి. ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు' అని మండిపడ్డారు.

# బలూచిస్థాన్‌లో ఘోర ప్రమాదం.. 40 మంది దుర్మరణం



క్వెట్టా/ఇస్లామాబాద్: పాకిస్థాన్ దక్షిణ పశ్చిమ రాష్ట్రం బలూచిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు లోయలో పడిపోవడంతో 40 మంది మృతి చెందారు. మరో 8 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం క్వెట్టా నుంచి దేశ రాజధాని ఇస్లామాబాద్ వైపు వెళ్తున్న ఈ బస్సు షెరాని--జోబ్ హైవేపై దనసర్ ప్రాంతంలో అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ఉన్నారన్నదానిపై స్పష్టత లేదు. రెస్క్యూ బృందాలు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. బస్సు ఓవర్‌లోడ్ కారణంగానే ప్రమాదం జరిగిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. మార్గమధ్యంలో మరో బస్సు చెడిపోవడంతో అక్కడి ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని వెల్లడించారు. దీంతో ప్రయాణికుల సంఖ్య పెరగడం.. బస్సు అదుపు తప్పి ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. షెరాని డిప్యూటీ కమిషనర్ హజ్రత్ వాలి కకర్ మాట్లాడుతూ, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నామని, మృతదేహాలను వెలికితీసే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ (వీజు=జ) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు 40 మృతదేహాలను వెలికితీశారు. గాయపడిన ఎనిమిది మందిని వెంటనే జోబ్ ట్రామా సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నీటి ప్రవాహంలో కాకుండా బండ రాళ్ల మీద బస్సు పడడంతో.. ప్రమాద తీవ్రత ఎక్కువగా నమోదైందని చెబుతున్నారు. ప్రమాద స్థలంలో ఆరు అంబులెన్సులు, 12 మంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పది లైట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సహాయక చర్యల్లో వచ్చి చేరాయి. స్థానిక అధికారులతో పాటు సమీప ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంత రెస్క్యూ బృందాలు కూడా ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి.

# ప్రజాసేవా విభాగాన్ని ప్రారంభించిన కర్ణాటక..
# పౌర సమస్యలు నేరుగా పరిష్కరించేందుకే: సీఎం డీకే



**న్యూఢిల్లీ,:** పాలనకు, పౌర సేవలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా సమస్యల్ని త్వరగా పరిష్కరించేందుకు 'ప్రజా సేవ విభాగాన్ని' ప్రారంభించింది. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఈ విభాగం కృషి చేస్తుంది. ఈ విభాగానికి ఒక మంత్రి నాయకత్వం వహిస్తారని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బంది సహకారం అందిస్తారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించి, సమస్యల్ని పరిష్కరిస్తారన్నారు. 'ప్రజా సేవా విభాగం'తోపాటు 'ప్రజా సేవ అభియాన (పీఎస్ఏ)' అనే మరో కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు సీఎం చెప్పారు. దీనిద్వారా మంత్రులు ప్రతి నెలా జిల్లాలకు వెళ్లి, స్థానిక ప్రజలతో మాట్లాడతారని, అక్కడి సమస్యలు విని పరిష్కరిస్తారని సీఎం డీకే శివకుమార్ తెలిపారు. క్యాబినెట్ సమావేశం అనంతరం సీఎం ఈ విషయాల్ని వెల్లడించారు. ప్రజల విజ్ఞాపనల్ని పరిష్కరించేందుకే ఈ విభాగాల్ని ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఈ విభాగంలో ఫిర్యాదు చేస్తే, సంబంధింత విభాగానికి వాటిని బదిలీ చేస్తామని, అక్కడి అధికారులు వాటిని పరిష్కరిస్తారని సీఎం వివరించారు. ఈ విభాగానికి ఒక ఐఏఎస్ అధికారి సెక్రెటరీగా ఉంటారని, ఇతర అధికారులను కూడా నియమించి ప్రజల ఫిర్యాదులపై నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రజల ఫిర్యాదుల్ని అవసరమైతే అధికారులతోపాటు సంబంధిత మంత్రులు, జిల్లా ఇంఛార్జ్ మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలిస్తారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఇక.. ప్రజా సేవ అభియానాలో భాగంగా జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రతినెలా మొదటి, మూడవ శనివారం తమ పరిధిలోని వివిధ నియోజకవర్గాలలో పర్యటిస్తారు. ఒకవేళ ఆ రోజు ప్రభుత్వ సెలవు దినం అయితే.. ముందు రోజే మంత్రులు పర్యటిస్తారు. స్థానికంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరిస్తారు. ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు చేర్చేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని డీకే శివకుమార్ వివరించారు.

# చైనాకే చుక్కలు చూపిస్తున్న కిమ్.. డ్రాగన్‌కు డబుల్ దోస్..


అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు.. అలాగని శాశ్వత మిత్రులూ ఉండరు. కేవలం స్వార్థ ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి. దీనికి చక్కటి ఉదాహరణగా.. ఇప్పుడు తూర్పు ఆసియాలో నడుస్తున్న హైడ్రామాను చెప్పుకోవచ్చు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్.. ఇటీవల హఠాత్తుగా ఉత్తర కొరియాలో ల్యాండ్ అయ్యారు. ప్రపంచ మీడియా అంతా ఇప్పుడు ప్యాంగ్యాంగ్ వైపే చూస్తోంది. ఎందుకంటే, నిన్న మొన్నటి వరకు ఉత్తర కొరియా అంటే చైనాకు ఒక చిన్న 'తోక దేశం' లాంటిది. బీజింగ్ గీసిన గీతను కిమ్ సామ్రాజ్యం దాటదు అనేది ఒక అంచనా. కానీ.. సీన్ కట్ చేస్తే ఇప్పుడు కథ పూర్తిగా రివర్స్ అయింది!

## చైనా చేతిలో రిమోట్ పనిచేయట్లేదా?

ఒకప్పుడు చైనా చేతిలో రిమోట్ కంట్రోల్‌లా ఉన్న ఉత్తర కొరియా సుప్రీం లీడర్ కిమ్ జోంగ్ ఉన్.. ఇప్పుడు ఏకంగా చైనాకే ముచ్చెమటలు పట్టిస్తున్నారు. అటు రష్యాతో గుట్టుగా నడిపిన ఆయుధాల బేరం.. ఇటు అమెరికాను ముప్పుతిప్పలు పెడుతున్న వైనం.. వీటన్నిటి మధ్య చైనా అసహనం..! అసలు కిమ్ జోంగ్ ఉన్ ఆడుతున్న ఈ గ్లోబల్ మైండ్ గేమ్ ఏంటి? చైనా-రష్యాల మధ్య ఉత్తర కొరియా ఎలా నలిగిపోతోంది? లేక ఇద్దరినీ వాడుకుంటోందా? అనే ప్రశ్నలు అంతర్జాతీయంగా చర్చకు దారితీస్తున్నాయి.

## జుచే నుంచి హత్యల వరకు..

ఈ గ్లోబల్ ఈక్వేషన్ అర్థం కావాలంటే.. మనం కొంచెం చరిత్ర పేజీల్లో వెనక్కి వెళ్లాలి. ఉత్తర కొరియా వ్యవస్థాపకుడు, కిమ్ జోంగ్ ఉన్ తాత అయిన కిమ్ ఇల్ సంగ్.. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌తో పోరాడిన గట్టి మిలిటరీ లీడర్. ఆయన దేశాన్ని ఏర్పాటు చేశాక 'జుచే' (జీబఎష్టవ) అనే ఒక వింత సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు. జుచే అంటే.. 'స్వయం సమృద్ధి' అని అర్థం. అంటే.. ఎవరితోనూ సంబంధం లేకుండా ఒంటరిగా బతకడం, అభివృద్ధి చెందడం. దాంతో.. ప్రపంచమంతా ఇండస్ట్రియల్ ఏజ్‌లో దూసుకుపోతుంటే.. ఉత్తర కొరియా మాత్రం ఒక చీకటి సామ్రాజ్యంగా మిగిలిపోయింది. ఎంతలా అంటే, రాజధాని ప్యాంగ్యాంగ్ మినహా దేశంలో దశాబ్దాల పాటు కరెంట్ కూడా లేని పరిస్థితి. కట్ చేస్తే.. 1990ల్లో సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయింది. అప్పటివరకు రష్యా నుంచి కొరియాకు వస్తున్న సాయం ఆగిపోయింది. ఈ పరిణామాలతో కిమ్ ఇల్ సంగ్ ఒక ప్రాక్టికల్ నిర్ణయం తీసుకున్నారు. 'జుచే' వర్కవుట్ కాదని గ్రహించి, దక్షిణ కొరియాతో విలీనం కోసం చర్చలకు సిద్ధపడ్డారు. కానీ, అంతర్జాతీయ ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ విలీనం జరిగితే తమ పదవులు ఊడిపోతాయని భయపడిన అక్కడి మిలిటరీ జనరల్స్.. కిమ్ ఇల్ సంగ్‌ను రహస్యంగా అంతమొందించారు. ఆ తర్వాత వచ్చిన కిమ్ జోంగ్ ఇల్.. కరడుగట్టిన కమ్యూనిస్ట్ భావజాలంతో బతికారు. ఆయన తెచ్చిన అనాలోచిత అగ్రికల్చర్ సంస్కరణల వల్ల దేశంలో ఏకంగా 20 లక్షల మంది ఆకలితో అలమటించి చనిపోయారు.





## కిమ్ హత్యాకాండ..!

దేశాన్ని నాశనం చేస్తున్న కిమ్ జోంగ్ ఇల్‌ను చూసి మిలిటరీ జనరల్స్ అలర్ట్ అయ్యారు. తర్వాతి తరం అయినా ప్రపంచాన్ని చూసి నేర్చుకోవాలని.. అప్పట్లో చిన్న పిల్లోడైన కిమ్ జోంగ్ ఉన్‌ను స్విట్జర్లాండ్‌కు పంపించి చదివించారు. కానీ, అనుకోకుండా కిమ్ జోంగ్ ఇల్ చనిపోవడంతో.. కేవలం 20 ఏళ్ల చిరు ప్రాయంలోనే కిమ్ జోంగ్ ఉన్ దేశాధినేత అయ్యాడు. కానీ ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. మిలిటరీ జనరల్స్ తన తాతను, తండ్రిని ఎలా వాడుకున్నారో కిమ్‌కు బాగా తెలుసు. అందుకే పవర్‌లోకి రాగానే.. తన తండ్రి కాలం నాటి పాత తరం జనరల్స్‌ను ఒక్కొక్కరినీ లేపేయడం మొదలుపెట్టాడు. సింగపూర్‌లో ఒకరిని చంపించాడు. రైల్వే మినిస్టర్‌ను ఏకంగా రైలు కిందే వేయించాడు. డిఫెన్స్ అటాచీని యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో షూట్ చేయించాడు. ఇలా భయోత్పాతం సృష్టించి.. టోటల్ పవర్‌ను తన గుప్పిట్లోకి తెచ్చుకున్నాడు కిమ్.

## ఉత్తర కొరియాపై చైనా పెత్తనం

కిమ్ అంతర్గతంగా పవర్ స్ట్రాంగ్ చేసుకున్నా.. ఎక్స్‌టర్నల్‌గా చైనా ఆధిపత్యం ఎక్కువైంది. 2017 సమయంలో.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. కిమ్‌ను బీజింగ్ పిలిపించుకుని తాతలా క్లాసులు పీకేవారు. చైనా మీడియా కూడా కిమ్‌ను ఒక చిన్న ప్రావిన్స్ లీడర్‌లా తక్కువ చేసి చూపించేది. ఇది ఈ యంగ్ డిక్టేటర్‌కు అస్సలు నచ్చలేదు. చైనా అహాన్ని దెబ్బకొట్టడానికి.. కిమ్ నేరుగా అప్పటి అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌తో చేతులు కలిపాడు. సింగపూర్, వియత్నాంలలో సమ్మిట్స్ జరిగాయి. అయితే, ట్రంప్ స్టేట్ డిపార్ట్‌మెంట్ బ్రీఫింగ్స్ సరిగ్గా చదవకపోవడం వల్ల.. ఆ చర్చలు ఫలించలేదు. అమెరికా చాప్టర్ క్లోజ్ అయింది.

## కలిసొచ్చిన ఉక్రెయిన్ యుద్ధం

చైనా ఒత్తిడి పెరుగుతోంది. మరి కిమ్ ఏం చేయాలి? సరిగ్గా అప్పుడే వచ్చింది ఉక్రెయిన్ యుద్ధం! 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం వల్ల రష్యా ఒంటరైంది. ఆయుధాల కొరత వచ్చింది. ఇదే అదనుగా కిమ్ రంగంలోకి దిగాడు. దశాబ్దాలుగా దాచి ఉంచిన కోట్ల కొద్దీ ఆర్టిలరీ షాట్స్‌ను రష్యాకు ట్రైన్ల ద్వారా పంపాడు. ఎంతలా అంటే, యుద్ధంలో రష్యా వాడిన ఆయుధాల్లో మూడింట ఒక వంతు ఉత్తర కొరియా అందజేసినవే..! అంతేకాదు.. ఏకంగా 10,000 మంది కొరియన్ సైనికులను రష్యా బోర్డర్‌లో రష్యా తరఫున యుద్ధం చేయడానికి పంపాడు. దీనికి ప్రతిఫలంగా రష్యా నుంచి కిమ్ ఏం తీసుకున్నాడో తెలుసా? అత్యాధునిక స్పేస్ టెక్నాలజీ..! ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ సాంకేతికత! దీనివల్ల ఇప్పుడు ఉత్తర కొరియా అమెరికాలోని ఏ మూలనైనా న్యూక్లియర్ మిసైల్‌తో కొట్టగల సామర్థ్యం సంపాదించింది. అంటే, కిమ్‌కు కావాల్సిన డబ్బు, ఎనర్జీ, టెక్నాలజీ అన్నీ ఇప్పుడు రష్యా ఇస్తోంది. దీంతో చైనా మీద ఆధారపడాల్సిన అవసరం కిమ్‌కు పూర్తిగా తప్పిపోయింది!

## నో విలీనం..

ఇదీ అసలు మ్యాటర్. ఇప్పుడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్యాంగ్యాంగ్ ఎందుకు వెళ్లారంటే.. తమ చేతుల్లోంచి జారిపోయి రష్యా గూటికి చేరిన కిమ్‌ను మళ్లీ లొంగదీసుకోవడానికి. కానీ కిమ్ మాత్రం 'తగ్గేదే లే' అంటున్నాడు. ఎలాంటి షరతులు లేకుండా సాయం చేస్తేనే ఓకే అని.. లేదంటే పొమ్మని నిర్మొహమాటంగా చెబుతున్నాడు. ఎందుకంటే కిమ్ ఈ ఏడాది ఒక సంచలన నిర్ణయం తీసుకున్నాడు. తమ రాజ్యాంగాన్ని మార్చేసి, "ఇకపై దక్షిణ కొరియాతో విలీనం అనే ముచ్చటే లేదు.. మాది విడిగా ఉండే ఒక స్వతంత్ర అణు దేశం" అని డిక్లేర్ చేసేశాడు. చైనా లాంటి ఒక గ్లోబల్ సూపర్ పవర్‌కే చుక్కలు చూపిస్తున్న కిమ్ జోంగ్ ఉన్.. రాబోయే రోజుల్లో ఆసియా పసిఫిక్ రీజియన్‌లో, ముఖ్యంగా గ్లోబల్ ఎకానమీలో ఎలాంటి అలజడి సృష్టిస్తాడో అని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గాయపడ్డ శరీరాలు.. బాంబులకు బదులు బంతితో సమాధానం!





ప్రపంచమంతా ఫిఫా ప్రపంచకప్ ఉత్సాహంలో మునిగిపోయింది. స్టేడియాలు అభిమానుల సందడితో మారుమోగుతున్నాయి. కానీ గాజాలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నం. కరెంట్ ఉండే కొద్దిసేపైనా టీవీ ముందు గుమిగూడటం.. ఇంటర్నెట్ సిగ్నల్ కోసం భవనాలపైకి ఎక్కడం.. బ్యాటరీని పొదుపుగా వాడుకుంటూ మ్యాచ్‌లు చూడటం అక్కడి ప్రజల దైనందిన దృశ్యం. అలాంటి యుద్ధ వాతావరణంలోనూ ఫుట్‌బాల్ మాత్రం వారికి కాసేపైనా భయాన్ని మరిచిపోయే ప్రపంచంగా మారింది. అయితే అక్కడి నుంచే ఇప్పుడు మరో ఫుట్‌బాల్ కథ ప్రపంచాన్ని కదిలిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో అవయవాలు కోల్పోయిన గాజా యువతులు.. ఇప్పుడు ఫుట్‌బాల్ మైదానంలో తమ జీవితానికి కొత్త అర్థం వెతుకుతున్నారు. పుట్టుకతోనే వైకల్యం ఉన్న అమ్మాయిలతో కలిసి పాలస్తీనాలో తొలి మహిళల అంప్యూటీ ఫుట్‌బాల్ జట్టుగా ఏర్పడి(ఖఎజూబ్‌వవ).. చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రతి వారం.. డీర్ అల్-బలాహ్‌లో దాడుల్లో మిలిగిన కొద్దిపాటి గడ్డి మైదానంలో వారు సాధన చేస్తున్నారు. వారి లక్ష్యం ఒక్కటే.. ఒకరోజు ప్రపంచ వేదికపై పాలస్తీనా జెండాను ఎగురవేయడం. గాజా ఆరోగ్య శాఖ అంచనా ప్రకారం యుద్ధం ప్రారంభమైన తర్వాత అక్కడ దాదాపు ఆరు వేల మంది అవయవాలు కోల్పోయారు. వీరందరికీ కృత్రిమ అవయవాలు, దీర్ఘకాలిక పునరావాసం అవసరమైంది. ఈ పరిస్థితుల్లోనే 2018లో స్థాపించబడిన పాలస్తీనా అంప్యూటీ ఫుట్‌బాల్ అసోసియేషన్ కొత్త ఆశాకిరణంగా మారింది. యుద్ధం తర్వాత వికలాంగుల సంఖ్య పెరగడంతో మహిళల జట్టులో చేరిన వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. "మా మైదానాలు ధ్వంసమయ్యాయి. సామగ్రి లేదు. అయినా ఈ అమ్మాయిల సంకల్పమే మమ్మల్ని ముందుకు నడిపించింది" అని అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఫాద్ అబూ ఘూలియన్ చెబుతున్నారు. ప్రపంచకప్ సందర్భంగా గాజా నుంచి వినిపించాల్సిన గొంతులు కూడా ఉన్నాయని, ముఖ్యంగా ఈ మహిళలు నిజమైన ఛాంపియన్లని ఆయన అంటున్నారు. 2027లో జరగనున్న మహిళల అంప్యూటీ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పాల్గొనడమే తమ లక్ష్యమని వెల్లడించారు. 24 ఏళ్ల రోజాన్ ఖైరా జీవితాన్ని మాత్రం యుద్ధమే ఒక్కసారిగా మార్చేసింది. 2023 నవంబరులో జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడిలో కుటుంబ ఇంటిపై బాంబు పడటంతో ఆమె ఒక కాలును కోల్పోయింది. ఒకప్పుడు పరుగుపందేల్లో పతకాలు గెలిచిన ఆమెకు అది పెద్ద దెబ్బే. కానీ అదే సంఘటన ఆమె సంకల్పాన్ని మరింత బలపరిచింది. ఇప్పుడు అంప్యూటీ ఫుట్‌బాల్ జట్టులో చేరి తన జీవితానికి కొత్త అర్థం వెతుక్కుంటోంది. గోల్‌కీపర్ ఐషా అల్ అబద్లా కథ మరింత హృదయవిదారకం. 2008 యుద్ధ సమయంలో ఆమె తల్లి తెల్ల భాస్వర(వైట్ పాస్ఫరస్) రసాయన ప్రభావానికి గురికావడంతో ఐషా ఒక చేయి పూర్తిగా అభివృద్ధి చెందకుండా జన్మించింది. అయినా దానిని ఆమె ఎప్పుడూ బలహీనతగా భావించలేదు. ఎనిమిదేళ్లుగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఆమెకు ఆటే జీవితం. "మైదానంలోకి దిగితే యుద్ధానికి ముందు ఉన్న రోజులు గుర్తొస్తాయి. మా జీవితంలో ఆనందం మళ్లీ తిరిగి వచ్చినట్లు అనిపిస్తుంది" అని చెబుతోంది. అయితే వీరి పోరాటం మైదానంలోనే ముగియడం లేదు. చాలామందికి శరణార్థి శిబిరాల నుంచి సాధనకు రావడానికి ప్రయాణ ఖర్చులే భారంగా మారుతున్నాయి. ఆహార కొరత, పోషకాహార లోపం, క్రీడా సామగ్రి కొరత వంటి సమస్యలు ప్రతిరోజూ వెంటాడుతున్నాయి. అయినా "పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా మా పట్టుదల మాత్రం తగ్గదు" అని రోజాన్ ధైర్యంగా చెబుతోంది. ప్రపంచం మొత్తం ఫిఫా ప్రపంచకప్‌ను చూస్తుంటే... డీర్ అల్-బలాహ్‌లోని ఈ యువతులు కూడా వీలైనప్పుడల్లా ఆ మ్యాచ్‌లను చూస్తున్నారు. కానీ వారు కేవలం ప్రేక్షకులుగా ఉండాలని కోరుకోవడం లేదు. ఒకరోజు అదే ప్రపంచం తమ ఆటను కూడా చూడాలని... తమ గాయాలను కాదు, తమ గెలుపును గుర్తించాలని కలలు కంటున్నారు. యుద్ధం వారి అవయవాలను దూరం చేసినా... ఫుట్‌బాల్‌పై ప్రేమను, జీవితంపై ఆశను మాత్రం ఏ బాంబూ చెరిపేయలేకపోయింది.



# 70 ఏళ్ల చరిత్రకు ముగింపు.. భవిష్యత్ విమానం ఇదేనా?

ఆకాశంలో ఎగిరే విమానం ఎలా ఉంటుంది?.. ఈ ప్రశ్నకు దాదాపు 70 ఏళ్లుగా ప్రపంచం ఒకటే సమాధానం చెబుతోంది. కానీ ఇప్పుడు ఆ సమాధానాన్నే మార్చేయాలనే ఓ స్టార్టప్ చేస్తున్న సాహసోపేత ప్రయత్నం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటివరకు మనం చూసిన విమానాల రూపమే గతం కావొచ్చనే చర్చ.. ఇటు విమానయాన రంగంలో మొదలైంది. ప్రపంచంలోని రెండు దిగ్గజ కంపెనీలు కూడా ఈ కొత్త ప్రయోగాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాయి. అంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు!.. దాదాపు రెండు దశాబ్దాలుగా ప్రపంచ వాణిజ్య విమానాల మార్కెట్‌ను రెండు దిగ్గజ సంస్థలు.. బోయింగ్, ఎయిర్‌బస్ శాసిస్తూ వస్తున్నాయి. మనం ఇప్పుడు చూస్తున్న బడా విమానాలన్నీ దాదాపుగా ఇవి రూపొందించినవే. అయితే ఇప్పుడు అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన స్టార్టప్ సంస్థ జెట్‌జీరో ఈ ఆధిపత్యానికి సవాల్ విసురుతోంది. సంప్రదాయ విమానాల కంటే పూర్తిగా భిన్నమైన డిజైన్‌తో, ఇంధన వినియోగాన్ని సగానికి తగ్గిస్తామని చెబుతున్న కొత్త తరహా విమానాన్ని అభివృద్ధి చేస్తోంది.

## రెక్కలు--శరీరం ఒకటే..

అమెరికాలోని మొహావే ఎడారిలో జెట్‌జీరో పూర్తి పరిమాణంలో ప్రదర్శన (డెమోన్స్ట్రేటర్) విమానాన్ని నిర్మిస్తోంది. సాధారణ విమానాల్లో శరీరం (ఫ్యూజలేజ్), రెక్కలు వేర్వేరుగా ఉంటాయి. కానీ జెట్‌జీరో ఆ డిజైన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టే పని చేపట్టింది. ఆ కంపెనీ రూపొందిస్తున్న విమానంలో రెండూ కలిసిపోయి ఒకే నిర్మాణంగా ఉంటాయి. దీనినే "బ్లెండెడ్ వింగ్ బాడీ" డిజైన్ అంటారు. ఈ ఆకారం మంతా రే చేపను పోలి ఉంటుంది.

## 50 శాతం ఇంధనం ఆదా!

ప్రస్తుతం విమానయాన సంస్థలకు అతిపెద్ద ఖర్చు ఇంధనమే. జెట్‌జీరో విమానం సాధారణ జెట్‌లతో పోలిస్తే 50 శాతం వరకు ఇంధనాన్ని ఆదా చేయగలదని సంస్థ పేర్కొంటోంది. దీని ఆకారం కారణంగా.. గాలిని చీల్చుకుంటూ వెళ్లేటప్పుడు తక్కువ నిరోధం (డ్రాగ్) ఏర్పడటం వల్ల ఇంధన వినియోగం భారీగా తగ్గుతుందని కంపెనీ చెబుతోంది. అంతేకాదు.. విమానం వెనుక భాగంపై ఇంజిన్లను అమర్చడం వల్ల నేలపై శబ్ద కాలుష్యం కూడా తగ్గుతుంది. కార్బన్ ఉద్గారాలు తగ్గడం ద్వారా పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని కంపెనీ చెబుతోంది.



## మరింత సుఖవంతమైన జర్నీ..

ఈ విమానం లోపలి నిర్మాణం కూడా భిన్నంగా ఉంటుంది. సాధారణంగా ఉండే సన్నని గొట్టం ఆకారంలోని కేబిన్‌కు బదులుగా విశాలమైన, చదునైన ప్రయాణికుల విభాగం ఉంటుంది. దీంతో.. పెద్ద కిటికీలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. సీట్ల అమరికను మరింత సౌకర్యవంతంగా మార్చవచ్చు. వంటగదులు (గ్యాలీలు), మరుగుదొడ్లను అవసరానికి అనుగుణంగా మార్చుకోవచ్చు. ప్రయాణికులకు ఎక్కువ స్థలం లభిస్తుంది. జెట్‌జీరో అభివృద్ధి చేస్తున్న 4 విమానం ఒకేసారి 200 నుంచి 270 మంది ప్రయాణికులను తీసుకెళ్లేలా రూపకల్పన చేశారు. గతంలో ఈ విభాగంలో బోయింగ్ 757, 767 విమానాలు కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు అదే మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని జెట్‌జీరో అడుగులు వేస్తోంది.

## నాసా పరిశోధనలకు కొనసాగింపు

బ్లెండెడ్ వింగ్ బాడీ ఆలోచన కొత్తది కాదు. గత మూడు దశాబ్దాలుగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(చీూూా) ఈ సాంకేతికతపై పరిశోధనలు నిర్వహిస్తోంది. అయితే ఇప్పటివరకు పూర్తి పరిమాణంలో వాణిజ్య విమానాన్ని నిర్మించే స్థాయికి ఏ సంస్థా రాలేదు. "కొత్త టెక్నాలజీని కనిపెట్టడం కాదు... ఇప్పటికే నిరూపితమైన సాంకేతికతను ఉపయోగించి వాణిజ్య విమానంగా మార్చడమే మా లక్ష్యం" అని జెట్‌జీరో సీఈఓ టామ్ ఓ'లీరీ చెబుతున్నారు.

## అమెరికా వైమానిక దళం అండ

జెట్‌జీరో ఆషామాషీ కంపెనీ ఏం కాదు. 2023లో అమెరికా వైమానిక దళం ఈ ప్రాజెక్టు కోసం 235 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ నిధులతో పూర్తి స్థాయి డెమోన్స్ట్రేటర్ విమానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అలాగే యునైటెడ్ ఎయిర్‌లైన్స్, అలస్కా ఎయిర్‌లైన్స్ వంటి ప్రముఖ విమానయాన సంస్థలు కూడా జెట్‌జీరోలో పెట్టుబడులు పెట్టాయి. దీంతో ఈ ప్రాజెక్టుపై విమానయాన రంగంలో ఆసక్తి మరింత పెరిగింది.

## 2030 నాటికి..

జెట్‌జీరో లక్ష్యం ప్రకారం డెమోన్స్ట్రేటర్ విమానం వచ్చే ఏడాది(2027) నాటికి తొలి పరీక్ష పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత చేపట్టే వరుస పరీక్షలు విజయవంతమైతే మరిన్ని పెట్టుబడులు సమీకరించాలని అనుకుంటోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే.. 2030కల్లా వాణిజ్య విమానాల ఉత్పత్తి ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. అదే సమయంలో ఈ డిజైన్‌ను సైనిక రవాణా, గగనతల ఇంధన నింపే విమానాలుగా కూడా ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తోంది.

## సవాళ్లు భారీగానే..

ఈ ప్రయాణం అంత సులభం కాదు. కొత్త డిజైన్ నిజంగానే ప్రకటించిన స్థాయిలో ఇంధనాన్ని ఆదా చేస్తుందా? భద్రతా ప్రమాణాలు ఎలా ఉంటాయి? ప్రపంచ విమానయాన నియంత్రణ సంస్థల నుంచి ధ్రువీకరణ పొందడానికి సంవత్సరాల సమయం, బిలియన్ల డాలర్ల పెట్టుబడి అవసరం అవుతుంది. "ఈ ప్రాజెక్టు ఇప్పుడే విజయవంతమైందని చెప్పలేం. కానీ అసాధ్యమని కూడా చెప్పలేం" అని విమానయాన రంగపు విశ్లేషకుడు రిచర్డ్ అబౌలాఫియా అభిప్రాయపడుతున్నారు. విమానాల రూపకల్పనలో దాదాపు 70 ఏళ్లుగా పెద్దగా మార్పులు రాలేదు. జెట్‌జీరో ప్రయత్నం విజయవంతమైతే, భవిష్యత్తులో మనం ప్రయాణించే విమానాల ఆకారంతో పాటు ఇంధన వినియోగం, ప్రయాణికుల అనుభవం పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. అయితే ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి సాంకేతిక, ఆర్థిక, నియంత్రణ పరమైన అనేక పరీక్షలను ఈ స్టార్టప్ విజయవంతంగా దాటాల్సి ఉంటుంది.

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

శనివారం - 04 - జూలై - 2026

# మెడ వణుకుతోంది... కనీసం ఫోన్‌ను పట్టుకోలేకపోతున్నా!



ఆ యువతి తరచూ మెడ నొప్పి, చేతుల్లో బలం తగ్గిపోతున్న సమస్యతో డాక్టర్‌ను సంప్రదించింది. తన జీవనశైలి, రోజువారీ అలవాట్లు, ఉద్యోగ ఒత్తిడి, నిద్రపోయే భంగిమ.. ఇవన్నీ కారణాలేమోనని ఆమె ముందుగానే అనుకుంది. కానీ అన్ని వివరాలు విన్న తర్వాత డాక్టర్ చెప్పిన మాటలు ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాయి. "అది సాధారణ అలసట కాదు... ఆమె శరీరం ఫోన్ ప్రభావానికి లోనవుతోంది" అనే వ్యాఖ్యతో అసలు సమస్యపై కొత్త చర్చ మొదలైంది. స్మార్ట్‌ఫోన్ వినియోగం ఇప్పుడు లింగ భేదానికి పరిమితం కాని సమస్యగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. గంటల తరబడి స్క్రీన్‌పై గడపడం వల్ల మెడపై ఒత్తిడి పెరగడం, భంగిమలో మార్పులు, చేతి బలం తగ్గడం వంటి లక్షణాలు యువతలో సాధారణంగా కనిపిస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పని, చదువు, వినోదం అన్నీ డిజిటల్ పరికరాలపైనే ఆధారపడటం వల్ల ఈ ప్రభావం మరింత విస్తరిస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇది ఒక్కరి సమస్య కాదు... ఆధునిక జీవనశైలి కలిగిస్తున్న సామూహిక ఆరోగ్య సవాలుగా మారుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వంటి డిజిటల్ పరికరాలు మన శరీర ఆకృతినే నిశ్శబ్దంగా ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల మెడ వంగిపోవడం, చూపు బలహీనపడటం, చేతి బలం తగ్గడం, మోటార్ స్కిల్స్‌పై ప్రభావం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. పైగా ఈ మార్పులన్నింటినీ ఇప్పుడు నిపుణులు ఒక కొత్త పదంతో వివరిస్తున్నారు. అదే "ఫోన్ బాడీ ". అంటే.. ఫోన్ అధికంగా ఉపయోగించడం వల్ల శరీరంలో కనిపిస్తున్న మార్పులు, భంగిమలో వచ్చే మార్పుల సమాహారం అని దీని అర్థం. ఇది వైద్యపరంగా అధికారిక పదం కాకపోయినా.. ఆధునిక జీవనశైలి ప్రభావాన్ని వివరించేందుకు వాడుతున్నారు. బీబీసీ టెక్నాలజీ జర్నలిస్ట్ థామస్ జర్మైన్ తన తాజా వ్యాసంలో ఈ వివరాలను సమగ్రంగా వెల్లడించారు. అందులో నిపుణుల చెప్పిన వివరాల ప్రకారం సమస్య కేవలం "స్క్రీన్ టైమ్" మాత్రమే కాదు.. ఎక్కువ సమయం ఇంట్లో కూర్చొని ఫోన్, కంప్యూటర్‌లకు అతుక్కుపోవడం కూడా ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మయోపియా (దూరం చూపు బలహీనత) కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అయితే దీని ప్రధాన కారణం ఫోన్‌ను దగ్గరగా చూడటం మాత్రమే కాదని, బయట సమయం తగ్గిపోవడమే ముఖ్య కారణమని నిపుణులు చెబుతున్నారు. సహజ కాంతి కళ్ల ఆరోగ్యానికి సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మరోవైపు "టెక్ నెక్" అనే సమస్య కూడా వేగంగా పెరుగుతోంది. నిరంతరం తల వంచి ఫోన్ చూడటం వల్ల మెడపై తీవ్ర ఒత్తిడి పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల వంచే కోణం పెరిగే కొద్దీ మెడపై పడే బరువు అనేక రెట్లు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వల్ల నొప్పులు, కండరాల గట్టిపడటం మాత్రమే కాకుండా భవిష్యత్తులో పోశ్చర్ మార్పులు కూడా రావచ్చని డెర్మటాలజీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక చేతి బలం విషయంలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా యువతలో గ్రిప్ స్ట్రెంగ్త్ తగ్గుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేవలం చేతుల బలహీనత మాత్రమే కాకుండా మొత్తం శారీరక ఆరోగ్య సూచికగా పరిగణించబడుతోంది. టెక్నాలజీ మోటార్ స్కిల్స్‌పైనా ప్రభావం చూపుతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఫోన్‌పై స్వైప్ చేయడం, క్లిక్ చేయడం వంటి పనుల్లో నైపుణ్యం పెరుగుతున్నప్పటికీ, చేతి-మెదడు సమన్వయంపై దీర్ఘకాలిక ప్రభావం ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు. అయితే నిపుణులు భయపడాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. రోజూ కొంతసేపు ఫోన్‌కు విరామం ఇవ్వడం.. కొన్ని అలవాట్లు మార్చుకుంటే "ఫోన్ బాడీ" ప్రభావాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

### 20--20--20 రూల్

ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్లు చూడాలని సూచిస్తున్నారు. ఇది కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

### మెడ పోశ్చర్‌పై దృష్టి

ఫోన్‌ను కిందకి వంచి చూడకుండా, కంటి లెవెల్‌లో ఉంచుకోవడం ద్వారా "టెక్ నెక్" ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### స్క్రీన్ టైమ్ పరిమితి

రోజులో నిర్దిష్ట సమయాన్ని మాత్రమే ఫోన్ వినియోగానికి కేటాయించడం మంచిదని నిపుణుల సూచన. అవసరం లేని స్క్రోలింగ్ తగ్గించాలి.

### శారీరక కదలికలు తప్పనిసరి

ప్రతి గంటకోసారి లేచి నడవడం, స్ట్రెచింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడటం తగ్గుతుంది.

### గ్రిప్ - చేతి వ్యాయామాలు

బంతి పట్టుకోవడం, స్ట్రెస్ బాల్ వాడడం, చిన్న హ్యాండ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం చేతి బలం మెరుగుపరుస్తాయని చెబుతున్నారు.

### బయట గడిపే సమయం పెంచాలి

సహజ కాంతి కళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. రోజులో కనీసం కొంత సమయం బయట గడపడం మయోపియా ప్రమాదాన్ని తగ్గించగలదు.

### డిజిటల్ డీటాక్స్ అలవాటు

వారానికి ఒకసారి కొన్ని గంటలు ఫోన్ లేకుండా గడపడం మానసికంగా, శారీరకంగా ఉపశమనం ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం మీద, ఫోన్ ఇప్పుడు మన జీవితంలో భాగంగా మారినప్పటికీ, అది శరీరంపై నెమ్మదిగా కానీ స్పష్టంగా ప్రభావం చూపుతోందని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. టెక్నాలజీని పూర్తిగా దూరం చేయలేకపోయినా, దాన్ని నియంత్రితంగా ఉపయోగించడం ద్వారా శరీరంపై దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కంటి సమస్యలు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వీటితో ఎన్నో ఉపయోగాలు..

కళ్లు పొడిబారడం (డ్రై ఐ సింద్రోమ్) ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ సమస్య. ఎక్కువసేపు కంప్యూటర్, మొబైల్ స్క్రీన్‌లను చూడటం, ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడపడం, వయస్సు పెరగడం, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా పోషకాల లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల కళ్లలో మంట, ఎర్రబడటం, మసకగా కనిపించడం, కనురెప్పలు అతుక్కుపోయినట్లు అనిపించడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే కొన్ని సహజమైన చిట్కాలు, సరైన ఆహారపు అలవాట్లు ఈ సమస్య నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. కళ్ల ఆరోగ్యానికి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం అవసరం. ముఖ్యంగా విటమిన్ ఎ కంటి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్యారెట్, బొప్పాయి, మామిడి, పాలకూర వంటి ఆకుకూరలు, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలను ఆహారంలో చేర్చడం వల్ల అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కళ్లలో సహజంగా కన్నీటి ఉత్పత్తి మెరుగుపడి పొడిబారడం తగ్గే అవకాశం ఉంటుంది.

### ఈ చిట్కాలను పాటించాలి..

కొబ్బరి నూనె కూడా డ్రై ఐ సమస్యలో కొంత ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, తేమను కాపాడే గుణాలు కళ్ల చుట్టూ ఉన్న చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. రెండు నుంచి మూడు చుక్కల కొబ్బరి నూనెను కళ్ల చుట్టూ నెమ్మదిగా రెండు నుంచి మూడు నిమిషాలు మసాజ్ చేసి, చర్మం పూర్తిగా పీల్చుకునే వరకు వదిలేయాలి. అయితే నూనె నేరుగా కంట్లో పడకుండా జాగ్రత్త వహించాలి. కీరదోస ముక్కలను కళ్లపై ఉంచడం కూడా ఉపశమనం కలిగించే చిట్కాల్లో ఒకటి. చల్లగా ఉంచిన కీరదోస ముక్కలను 15 నిమిషాల పాటు కళ్లపై ఉంచితే మంట, దురద, ఎర్రదనం తగ్గడంలో సహాయపడుతుంది. కీరదోసలో ఉండే విటమిన్ ఎ కళ్లకు పోషణ అందించడంలో ఉపయోగపడుతుంది. రోజూ ఒక గిన్నె పెరుగు తినడం కూడా కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పెరుగులో విటమిన్ డి, విటమిన్ బి, విటమిన్ ఎ వంటి పోషకాలు ఉండటంతో కళ్లకు అవసరమైన పోషణ అందించి పొడిబారడం వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.



### ఎక్కువ సేపు ఫోన్ లేదా కంప్యూటర్ చూస్తే..

కళ్లను తరచూ రెప్పవేయడం కూడా చాలా ముఖ్యమైన అలవాటు. రెప్పవేయడం వల్ల సహజంగా కన్నీటి పొర కంటి ఉపరితలంపై సమానంగా వ్యాపించి తేమను నిలబెడుతుంది. ముఖ్యంగా కంప్యూటర్ లేదా మొబైల్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు ప్రతి కొద్ది నిమిషాలకు ఒకసారి రెప్పవేయడాన్ని అలవాటు చేసుకోవాలి. గోరువెచ్చని నీటిలో ముంచిన మెత్తని వస్త్రంతో కళ్లకు కాపడం పెట్టడం కూడా మంచి ఉపశమనం ఇస్తుంది. మెత్తని వస్త్రాన్ని గోరువెచ్చని నీటిలో ముంచి అదనపు నీటిని పిండి, కళ్లపై ఏడు నుంచి ఎనిమిది నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ రక్తప్రసరణ మెరుగుపడి సహజమైన తేమ ఉత్పత్తికి దోహదపడుతుంది. అయితే కళ్లు పొడిబారడం ఎక్కువకాలం కొనసాగితే, తీవ్రమైన నొప్పి, చూపు తగ్గడం లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# ఆరోగ్యంగా ఉండాలంటే మందులను మింగడమే కాదు, పోషకాహారం తీసుకోవడం కూడా ముఖ్యమే..



ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మందులతోపాటు ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా కూరగాయల్లో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని కూరగాయలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి వంటి అంశాలకు మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు కాలీఫ్లవర్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో ఉండే ఇండోల్స్, గ్లూకోసినోలేట్స్ వంటి సమ్మేళనాలు కాలేయం సహజంగా వ్యర్థాలను తొలగించడంలో తోడ్పడి, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

### బీట్‌రూట్, కాకరకాయ, పాలకూర..

రక్తపోటు ఉన్నవారికి బీట్‌రూట్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే సహజ నైట్రేట్లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడతాయి. దీంతో రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు కాకరకాయను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. ఇందులో ఉండే పోలీపెప్టైడ్-పీ, కారంటిన్ వంటి సమ్మేళనాలు సహజ ఇన్సులిన్ మాదిరిగా పనిచేసి గ్లూకోజ్ నియంత్రణకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో ఐరన్ లోపం ఉన్నవారికి పాలకూర మంచి ఎంపిక. ఇందులో ఐరన్‌తోపాటు ఫోలేట్ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇవి ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరం. పాలకూరతోపాటు నిమ్మరసం వంటి విటమిన్ సి అధికంగా ఉండే పదార్థాలను తీసుకుంటే ఐరన్ శోషణ మరింత మెరుగుపడుతుంది.

### ముల్లంగి, క్యారెట్..

జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి ముల్లంగి ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే పీచుపదార్థం మలబద్ధకాన్ని తగ్గించి పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. అలాగే పిత్తరసం విడుదలను ప్రోత్సహించడం ద్వారా కొవ్వు జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. కంటి ఆరోగ్యానికి క్యారెట్ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే బీటా కెరోటిన్ శరీరంలో విటమిన్ ఎగా మారి కంటి చూపును కాపాడటంలో, కంటి ఉపరితలాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు క్యాప్సికమ్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ పోషకం తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచి ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు శరీరానికి సహాయపడుతుంది.

### తోటకూర, ఉసిరి..

చర్మం కాంతివంతంగా ఉండేందుకు తోటకూర ఉపయోగపడుతుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి చర్మానికి సహజమైన మెరుపును అందించడంలో తోడ్పడుతుంది. ఉసిరికాయను పోషకాహార నిపుణులు సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటున్నారు. ఇందులో నారింజ రసం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జుట్టు, గుండె ఆరోగ్యం, జీవక్రియకు కూడా మేలు చేస్తుంది. అయితే ఈ కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, ఇవి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కావని గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఏదైనా వ్యాధికి చికిత్స పొందుతున్నవారు వైద్యుల సూచనల మేరకు మందులు కొనసాగిస్తూ, సమతుల్య ఆహారంలో భాగంగా ఈ కూరగాయలను చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు తెలియజేస్తున్నారు.

# 'ఏఐ'తో 'ఆట'లొద్దు

- మనుషులకంటే ఏఐ బాగా అర్థం చేసుకుంటుందనుకుంటున్న జనం
- ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్న 65 శాతం మంది భారతీయులు
- ఇది ప్రపంచ సగటు 31 శాతంతో పోలిస్తే రెండింతలకు పైగా ఎక్కువ
- చిన్నారుల్లో భారీగా పెరుగుతున్న ఏఐ వినియోగం
- పిల్లల్లో స్వయంగా ఆలోచించే శక్తి తగ్గిపోయే ప్రమాదం
- ఆందోళన కలిగిస్తున్న 'భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్--2025' గణాంకాలు

అమరావతి: కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్యం, సమాచార రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. మన దేశంలోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ సర్వే--2024 ప్రకారం భారతీయుల్లో 65 శాతం మంది జనరేటివ్ ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు 31 శాతంతో పోలిస్తే రెండింతలకంటే ఎక్కువ. విద్యార్థులకు పాఠాలు అర్థం చేసుకోవడం, సందేహాల నివృత్తి, కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఏఐ ఉపయోగపడుతోంది. అదే సమయంలో పిల్లల మానసిక ఆరోగ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, గోప్యత వంటి అంశాలపై ప్రతికూల ప్రభావాలు చూపుతోంది. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ నిర్వహించిన 'భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్ 2025' అధ్యయనం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ముగ్గురిలో ఒకరు వారి వ్యక్తిగత సమస్యలు, భావోద్వేగాలను ఏఐతో పంచుకుంటున్నారు. ఏఐతో వ్యక్తిగత విషయాలు చర్చించిన వారిలో 25 శాతం మంది 'మనుషుల కంటే ఏఐ నన్ను బాగా అర్థం చేసుకుంటుంది' అని భావిస్తున్నారు.

### ఆలోచనా శక్తిపై ప్రభావం

ఇదే సర్వేలో మరో ఆందోళనకర అంశం బయటపడింది. ఏఐ గురించి తెలిసిన పిల్లల్లో 75 శాతం మంది ఏఐ పనితీరుపై అవగాహన లేక దాన్నొక సెర్చ్ ఇంజిన్‌లా భావిస్తున్నారు. అలాగే 46 శాతం కుటుంబాలు ఏఐ వల్ల తప్పుడు సమాచారం (మిస్‌ఇన్‌ఫర్మేషన్) వచ్చే ప్రధాన ప్రమాదమని పేర్కొన్నాయి. ఏఐ వెంటనే సమాధానాలు అందించడం వల్ల పిల్లలు స్వయంగా ఆలోచించడం, సమస్యలను విశ్లేషించడం, పరిష్కారాలు కనుగొనడం వంటి నైపుణ్యాలను కోల్పోయే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. హోంవర్క్, ప్రాజెక్టులు, వ్యాసాలు అన్నింటికీ ఏఐపై ఆధారపడితే సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం దెబ్బతినే అవకాశం ఉంది. యునిసెఫ్ నివేదికల ప్రకారం.. ఏఐ చాట్‌బాట్లతో ఎక్కువ సమయం గడిపే పిల్లల్లో ఒంటరితనం, భావోద్వేగ సంబంధాలు, సామాజిక సంబంధాలు తగ్గిపోవడం వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు.

### 'ఏఐ' రూపంలో కొత్త ముప్పు

ఏఐ అందించే సమాచారం ఎల్లప్పుడూ సరైనదే కావాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు వాస్తవాలకు విరుద్ధమైన లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని కూడా అందించవచ్చు. చిన్నారులు దానిని నిజమని నమ్మే ప్రమాదం ఉంది. అలాగే వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, చాటింగ్ డేటా వంటి సమాచారాన్ని ఏఐ ప్లాట్‌ఫారమ్‌లలో పంచుకోవడం వల్ల గోప్యత సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఏఐ టెక్నాలజీతో డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు సృష్టించడం సులభమవుతోంది. అమెరికాలో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం 33 శాతం మంది టీనేజర్లు వారి అనుమతి లేకుండా వారి ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ చిత్రాలు రూపొందించారని తెలిపారు. అలాగే 54 శాతం మంది ఇలాంటి కంటెంట్‌ను అందుకున్నట్లు చెప్పారు. యూకేలో 8 నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో దాదాపు 22 శాతం మంది ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి.




40 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలకు ఏఐ భద్రత గురించి తల్లిదండ్రులు ఎప్పుడూ వివరించలేదు. ఏఐ వాడే పిల్లల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది ఆరోగ్యం లేదా శరీరానికి సంబంధించిన సలహాల కోసం చాట్‌బాట్లను ఆశ్రయిస్తున్నారు. ఆరుగురిలో ఒకరు (సుమారు 17 శాతం) ఏఐ ద్వారా అనుచిత కంటెంట్ చూశామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల విద్య, మానసిక అభివృద్ధిపై ప్రభావం ఉంటుందనే ఆందోళనతో కొన్ని దేశాలు పాఠశాలల్లో ఏఐ వినియోగంపై నియంత్రణ విధించాలని భావిస్తున్నాయి. కానీ ఏఐను పూర్తిగా నిరోధించడం సాధ్యం కాదు. పిల్లలు దానిపై పూర్తిగా ఆధారపడకుండా, ఇతర మంచి విషయాలవైపు మళ్లేలా వారికి మార్గనిర్దేశం చేయాలి. అలాగే తప్పుడు సమాచారం, గోప్యత, డీప్‌ఫేక్ ముప్పుల గురించి అవగాహన కల్పించడం అవసరం. ఏఐ టెక్నాలజీ భవిష్యత్తును మార్చగల శక్తివంతమైన సాధనం. అయితే నియంత్రణ లేకుండా వినియోగిస్తే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

### భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్--2025 అధ్యయనం ప్రకారం ఏఐ వినియోగం ఇలా..

జనరేటివ్ ఏఐ టూల్స్ వినియోగిస్తున్న విద్యార్థులు -- 35 శాతం
వీరిలో సందేహాల నివృత్తికి -- 73 శాతం
కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి -- 48 శాతం
పరీక్షల సన్నద్ధతకు -- 32 శాతం

### అమెరికాలో కామన్‌సెన్స్ మీడియా 2026 అధ్యయనం ప్రకారం..

9 నుంచి 17 సంవత్సరాల పిల్లల్లో ఏఐ వినియోగిస్తున్న వారు -- 86 శాతం
వీరిలో నిత్యం ఏఐతో మమేకమయ్యే వారు -- 25 శాతం
ఏఐ కంపానియన్ చాట్‌బాట్ల ఉపయోగించే టీనేజర్లు -- 72 శాతం
రోజూ వాటితో మాట్లాడేవారు -- 13 శాతం

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\
Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\